
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 28.5
కనిష్ఠం 22.5
****
ANDHRAJYOTHY

నల్లగొండ
5
మంగళవారం 23 సెప్టెంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.60 (305.50)	3,32,150	3,32,150
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.70 (4.12)	65950.62	5651.42
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	170.831 (39.5561)	2,89,300	3,14,300

చికెన్ ధరలు | లైవ్ : రూ.160 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.255

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ఊరట లభించనుంది. గతంలో యాంత్రీకరణ పరికరాలపై పెద్ద ఎత్తున అంటే 18శాతం వరకు జీఎస్టీ ఉండేది. ప్రస్తుతం ఐదు శాతానికి తగ్గడంతో పరికరాల ధరలు తగ్గుముఖం పట్టాయి. అదే విధంగా యాంత్రీకరణ పథకాన్ని పారదర్శకంగా అమలు చేయడం కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ శాఖ మండల స్థాయిలో త్రీమెన్ కమిటీల నుంచి తీర్మానాలను సేకరిస్తుంది.
- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)



జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ఊరట

- తగ్గనున్న 15 రకాల యంత్రాల ధరలు
- యాంత్రీకరణకు త్రీమెన్ కమిటీల తీర్మానాలు
- జిల్లా కమిటీలకు మండలస్థాయి అధికారుల సిఫారసులు
- వచ్చే నెల 15లోగా పరికరాల పంపిణీకి సన్నాహాలు

యాంత్రీకరణ పథకం అమలు కోసం ముందుగా త్రీమెన్ కమిటీల తీర్మానాలు చేపడుతున్నారు. ఈ కమిటీలో తహసీల్దార్, మండల వ్యవసాయ అధికారి, ఎంపీడీవో ఉంటారు. వీరు ముగ్గురు ఆయా మండలాల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన జాబితాను జిల్లా కమిటీలకు సిఫారసు చేస్తారు. జిల్లా కమిటీలో జిల్లా వ్యవసాయ అధికారులతోపాటు శాస్త్రవేత్తలు తుది జాబితాను ఎంపికచేసి ఆయా జిల్లా కలెక్టర్లకు సమర్పిస్తారు. ఇప్పటికే రెండుసార్లు వివిధ కారణాలతో వాయిదా పడిన నేపథ్యంలో పథకాన్ని త్వరగా పూర్తి చేయాలని నిర్ణయించారు. యూరియా కోసం రైతులు పెద్దఎత్తున క్యూకట్టిన నేపథ్యంలో తెలంగాణలోని అన్ని జిల్లాలతోపాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, నల్లగొండ జిల్లాలో ఈ పథకాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారు.

పరికరాల ధరలు తగ్గుముఖం

కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ స్లాబ్‌లను నాలుగు నుంచి రెండు చేయడంతోపాటు సామాన్య ప్రజలపై భారం పడకుండా మార్పులు చేశారు. దీంతో రైతులపై కూడా భారం తగ్గనుంది. గతంలో యాంత్రీకరణ పరికరాలపై పెద్ద ఎత్తున అంటే 18శాతం వరకు జీఎస్టీ ఉండేది. ప్రస్తుతం 5శాతానికి తగ్గడంతో పరికరాల ధరలు తగ్గుముఖం పట్టాయి. జీఎస్టీ తగ్గించడంతో ఆయా కంపెనీలు కూడా వ్యవసాయ శాఖ అధికారులకు తగ్గించిన రేట్లను సవరించి పంపడంతో పథకంలో చేర్పులు మార్పులు చేస్తున్నారు. పథకం అమలు కంటే ముందే జీఎస్టీ తగ్గడంతో రైతులకు ఎంతో ప్రయోజనం ఉందని చెప్పవచ్చు. మొత్తం 15 రకాల పరికరాలకు సంబంధించి ధరలు తగ్గనున్నాయి. ఆధునిక వ్యవసాయాన్ని ప్రోత్సహించడంకోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని పునరుద్ధరించింది. పరికరాల్లో ప్రధానంగా రోటోవేటర్లు, నాగళ్లు, కల్టివేటర్లు, స్ప్రేయర్లు, పవర్ వీడర్లు, డ్రోన్లు ...

- మిగతా 7వ పేజీలో...

బాలా త్రిపుర సుందరిదేవిగా దర్శనం


నల్లగొండలోని రాక్‌హిల్స్ కాలనీలో బాలా త్రిపుర సుందరిదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

నల్లగొండ కల్చరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తొమ్మిది రోజులపాటు నిర్వహించే దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారికి పూజలు నిర్వహించారు. తొలిరోజు బాలా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

భూసేకరణ ప్రక్రియను పూర్తిచేయాలి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి


కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా మిగిలిపోయిన భూసేకరణ ప్రక్రియను ఈనెలాఖరు లోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం ఆయన సచివాలయం నుంచి జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణ పనులకు అవసరమైన భూ సేకరణపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దసరా పండుగకు ముందే అన్ని జాతీయ రహదారుల భూసేకరణ పనులు పూర్తి కావాలన్నారు. కోర్టు కేసులు ఉన్న భూములకు సంబంధించి పూర్తి వివరాలను వెంటనే ప్రభుత్వానికి పంపాలన్నారు. టైటిల్ సమస్యలు ఉన్న భూముల విషయంలో పరిహారం మొత్తాన్ని డిపాజిట్ చేసి, భూములను సేకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రహదారి నిర్మాణ పనుల్లో జాప్యం జరగకుండా ప్రతీ కేసును అత్యంత ప్రాధాన్యంగా పరిగణించాలన్నారు. భూసేకరణలో ఎలాంటి ఆలస్యం జరుగకూడదన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఇన్‌చార్జి డీఆర్‌వో అశోక్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీధర్ రెడ్డి, జాతీయ రహదారుల సంస్థ ఈఈ మురళి, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' దరఖాస్తులను పరిష్కరించాలి

అదనపు కలెక్టర్(రెవెన్యూ) జె. శ్రీనివాస్

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం అయన కలెక్టరేట్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా అధికారులు ఫిర్యాదులపై వెంటనే స్పందించి పరిష్కరించాలని, అదేవిధంగా ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో మండల, గ్రామస్థాయిలో పనిచేసే వారి సిబ్బందికి ఇదేవిధంగా ఆదేశించాలన్నారు. కాగా ఈసోమవారం మొత్తం 72 దరఖాస్తులు రాగా, ఇందులో రెవెన్యూ శాఖకు 46, మిగతావి వివిధ శాఖలకు సంబంధించి వచ్చాయి. ఈ సోమవారం ఎప్పటిలాగే వ్యక్తిగత అంశాలు, భూములకు సంబంధించిన విషయాలు, తదితర అంశాలపై ఎక్కువ పిర్యాదులు వచ్చాయి. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్ కుమార్, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, జిల్లా అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

వీధిలైట్లకు దసరా వెలుగొచ్చేనా?

- అరువు దొరకక ఇబ్బందిపడిన గ్రామపంచాయతీలు
- అదనపు కలెక్టర్ నేతృత్వంలో డీఎల్‌పీసీ ఏర్పాటు?
- ఎల్ఈడీలకు రేట్లను నిర్ణయించిన డీఎల్‌పీసీ
- ఇండెంట్ అడుగుతున్న జిల్లా పంచాయతీ అధికారులు


నార్కట్‌పల్లి గ్రామ పంచాయతీ భవనం, గతంలో జీపీలు కొనుగోలు చేసిన ఎల్ఈడీలు, బల్బులు

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల బాధ్యతలో వీధిలైట్ల నిర్వహణ కూడా భాగమే. కానీ రెండేళ్లుగా గ్రామపంచాయతీలు పంపిన బిల్లులు మంజూరు కాకపోవడంతో వీధిలైట్ల నిర్వహణలో చిన్న గ్రామపంచాయతీలు దాదాపు చేతులెత్తేసినంత పనిచేశాయి. పంచాయతీలకు పాలకవర్గాలు కూడా లేకపోవడంతో కొన్ని గ్రామాల్లో అంధకారం అలుముకున్నా పట్టించుకునే వారే లేని పరిస్థితి. మేజర్ గ్రామ పంచాయతీలైతే స్థానిక వ్యాపారుల ద్వారా అరువు తెచ్చి వీధిలైట్ల సమస్య తలెత్తకుండా ఇంతకాలం నెట్టుకొచ్చారు. కానీ బిల్లులు రాకపోవడంతో వీటికి కూడా అరువు దొరకని పరిస్థితి ఎదురైంది. ఈ సమస్యను అర్థం చేసుకున్న కలెక్టర్ జీపీలపై వీధిలైట్ల కొనుగోలు భారం పడకుండా ప్రత్యామ్నాయం చూపారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అధికారి నేతృత్వంలో డీపీవో, సీఈవో, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్‌స్థాయి అధికారులు సభ్యులుగా డీఎల్‌పీసీ (జిల్లా స్థాయి పర్చేజ్ కమిటీ)ని నియమించారు. గ్రామపంచాయతీలకు బ్లీచింగ్ పౌడర్, దోమల నివారణ మందులు, తదితర పారిశుధ్య సామగ్రిని సరఫరా చేసేందుకు ఓపెన్ టెండర్ నిర్వహించి కాంట్రాక్టర్‌ను నియమించిన పద్ధతిలోనే వీధిలైట్ల ఎల్ఈడీ బల్బుల సరఫరాకు కూడా బహిరంగ వేలం నిర్వహించారు. నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ డివిజన్‌ల పరిధిలో డీఎల్‌పీసీ నిర్ణయించిన రేట్లకే వీధిలైట్లు సరఫరా చేసే కాంట్రాక్ట్‌ను అక్షయ ట్రేడర్స్ చేజిక్కించుకుంది.

ఊపిరిపీల్చుకున్న జీపీ కార్యదర్శులు

దసరా వస్తుండటంతో గ్రామపంచాయతీ కార్యదర్శుల్లో టెన్షన్ మొదలైంది. రోజువారీగా వీధిలైట్ల నిర్వహణ ఎలా ఉన్నా దసరాకు మాత్రం దాదాపు అన్ని గ్రామాల్లో వీధిలైట్లను వేయాల్సి ఉంటుంది. అయితే గతేడాది వరకు జీపీల్లో డబ్బులు లేకున్నా అరువు తెచ్చి వీధిలైట్లతో గ్రామాల్లో ఎలాగోలాగ 'వెలుగు'లు నింపేవారు. కానీ రెండేళ్లుగా వీధిలైట్లు ఇతర సామగ్రి కొనుగోలుకు సంబంధించి ఎంబీలు సమర్పించినా బిల్లులు రాకపోవడంతో వ్యాపారులు కూడా అరువు ఇచ్చేందుకు విముఖత చూపుతున్నట్లు తెలుస్తోంది. దీంతో సొంత డబ్బులతో వీటిని సమకూర్చాల్సి వస్తుందేమోనన్న ఆందోళన పంచాయతీ కార్యదర్శుల్లో వ్యక్తమైంది. ఈ సమయంలో డీఎల్‌పీసీ బహిరంగ వేలం నిర్వహించి ఎల్ఈడీ బల్బులను సరఫరా చేసే కాంట్రాక్టర్‌ను నియమించడంతో పంచాయతీ కార్యదర్శులపై కాస్త భారం తగ్గినట్లయింది.

డీఎల్‌పీసీ నిర్ణయించిన ధరలివే..

గ్రామ పంచాయతీల్లో అవసరమయ్యే ఐదు రకాల ఎల్ఈడీ (లెడ్) బల్బులకు డీఎల్‌పీసీ నిర్ణయించిన ధరలు ఇలా ఉన్నాయి. 24 వాట్స్ లెడ్ స్ట్రీట్‌లైట్ ఒకదానికి రూ.1200, 36 వాట్స్ లెడ్ స్ట్రీట్‌లైట్‌కు రూ.1600, 50 వాట్స్ లెడ్ స్ట్రీట్‌లైట్‌కు రూ.2400, 28 ఎంఎం ఐరన్ క్లాంప్ విత్ పైప్‌కు రూ.300, 15 వాట్స్ లెడ్ బల్బ్ విత్ హోల్డర్‌కు రూ.300 చొప్పున డీఎల్‌పీసీ ధర నిర్ణయించింది. ఈ మేరకే బహిరంగ వేలం ద్వారా సరఫరా హక్కు పొందిన కాంట్రాక్టర్ డీఎల్‌పీసీ నిర్ణయించి పై ధరల్లోపే ఇండెంట్ పెట్టిన గ్రామ పంచాయతీలకు సరఫరా చేయాల్సి ఉంది.

ఇండెంట్ అడుగుతున్న అధికారులు

దసరా పండుగ దగ్గర పడుతుండటంతో ఎల్ఈడీ వీధిలైట్ల సరఫరాకోసం జిల్లా అధికారులు మండలాల నుంచి ఇండెంట్ అడుగుతున్నారు. దీంతో మండలస్థాయిలో ఎంపీవోలు గత రెండు రోజులుగా గూగుల్ మీట్‌లో ప్రధాన ఎజెండాగా వీధిలైట్ల ఇండెంట్‌ను ప్రస్తావించి త్వరగా ఇండెంట్ పెట్టేలా పంచాయతీ కార్యదర్శులను ఆదేశిస్తున్నారు. ఏయే వాట్స్ బల్బులు.. ఎన్నికావాలో ఇందుకోసం రూపొందించిన ఫార్మట్‌లో ఇవ్వాల్సి ఉంది. అయితే డీఎల్‌పీసీ నిర్ణయించిన రేట్ల మేరకే ఇవి సరఫరా చేయబడుతున్నా వీటి కొనుగోలుకయ్యే డబ్బులు మాత్రం సంబంధిత గ్రామ పంచాయతీయే సరఫరాదారుకు చెక్కులు...

మిగతా 8వ పేజీలో...

ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు

కలెక్టర్ ఇలాత్రిపాఠి

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఇలాత్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీరోజు పలు శాఖల ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ నెల 23న బుద్ధవనంలో ప్రత్యేకంగా బతుకమ్మ ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. 23న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, డీసీహెచ్ఎస్, యువజన సర్వీసులు, కార్మిక, మెప్మా శాఖలు ఎన్జీ కళాశాల మైదానంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించాలన్నారు. 24న వ్యవసాయ, ఉద్యాన, సెరీకల్చర్, హ్యాండ్లూమ్స్, పశుసంవర్ధక శాఖలు, 25న మునిసిపల్, ట్రాన్స్‌కో, ఫిషరీస్, సంక్షేమ శాఖలు, 26న డీఆర్డీఏ, డీపీవో, సీపీవో, ఆర్టీసీ, మెప్మా ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించాలన్నారు ఈ నెల 27న అటవీ, పోలీస్, ఎక్సైజ్, ఫైర్, ఆర్టీవో, మెప్మా శాఖలు, 28న రెవెన్యూ, దేవాదాయ, సహకార, పౌరసరఫరాల, టీఎస్జీవో, సర్వేల్యాండ్‌రికార్డ్స్ ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించాలన్నారు. 29న జిల్లా విద్యాశాఖ, అన్ని ఇంజనీరింగ్ శాఖలు, మెప్మా, ఈ నెల30 న బార్ అసోసియేషన్, రోటరీ క్లబ్, రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించాలన్నారు. నల్లగొండ ఆర్డీవో బతుకమ్మ ఉత్సవాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, మునిసిపల్ కమిషనర్ ఎన్జీ కళాశాల మైదానంలో లైటింగ్, డయాస్, తాగునీరు, ఇతర ఏర్పాట్లు చేయాలని, పోలీస్‌శాఖ తరఫున అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. బుద్ధవనంలో నిర్వహించే బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా మిర్యాలగూడ సబ్ కలెక్టర్, నందికొండ మునిసిపల్ కమిషనర్, బుద్ధవనం స్పెషల్ ఆఫీసర్, పెద్దవూర తహసీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ వహించి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు.

ప్రశాంతంగా నిర్వహించుకోవాలి : ఎస్పీ

దుర్గమాత నవరాత్రి ఉత్సవాలు, బతుకమ్మ సంబరాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఎస్పీ శరత్ చంద్రపవార్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్సవాలు జరిగే ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్‌శాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసిందన్నారు. బతుకమ్మ సంబరాల్లో మహిళలు, యువతులపై వేధింపులు, ఈవ్‌టీజింగ్‌లకు పాల్పడకుండా నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా ఆకతాయిలు వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రీవెన్స్‌డేలో ఫిర్యాదుల పరిశీలన

జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్‌డే సందర్భంగా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పలు ఫిర్యాదులను పరిశీలించారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డేకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 37మంది అర్జీదారులు వచ్చి ఎస్పీని కలిసి తమ సమస్యలను తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వర న్యాయం చేయాలని ఆదేశించారు.

బసవేశ్వరుడి విగ్రహం ఏర్పాటు చేయాలి


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తొలి సంఘ సంస్కర్త బసవేశ్వరుడి విగ్రహాన్ని జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేయాలని బసవేశ్వర విగ్రహ ప్రతిష్ఠ సాధన కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11వ శతాబ్ధంలోనే సమాజంలోని కుల, మత వర్ణ, వర్గ, లింగ బేధాలు రూపు మాపేందుకు కృషిచేసిన మహోతన్నతుడు బసవేశ్వరుడని అని కొనియాడారు. ప్రస్తుతం నడుస్తున్న పార్లమెంట్‌కు దిక్సూచిగా నాడు బసవేశ్వరుడు నిర్వహించిన అనుభవ మండపం నిలుస్తుందన్నారు. పార్లమెంట్‌లో బసవేశ్వరుడి విగ్రహం ఏర్పాటుచేసి, ప్రతి ఏటా జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నారన్నారు. అంతటి మహోన్నత వ్యక్తి విగ్రహం జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా పట్టణంలో బసవేశ్వరుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ఇమ్మడి పరమేష్, గౌరవాధ్యక్షుడు దొడ్డ శాంతికుమార్, ప్రధాన కార్యదర్శి ధర్మశెట్టి కోటి, కార్యనిర్వాహక అధ్యక్షుడు పొగాక నాగరాజు, కోశాధికారి కర్నె వరప్రసాద్, ఉపాధ్యక్షులు ఉప్పు శేఖర్, బొజ్జ నాగరాజు, వెంబడి లింగప్ప, పత్తి వినయ్‌కుమార్, కర్నె ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

34 రోజుల్లో రూ.2 కోట్లు

- యాదగిరీశుడి హుండీ ఆదాయం



7

అరచేతిలో వ్యవసాయ సమాచారం

- రైతుల కోసం వాట్సాప్ చానల్



వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు నేరుగా చేరవేసేందుకు వ్యవసాయ శాఖ కమిషనరేట్ వాట్సాప్ చానల్‌ను అందుబాటులోకి తెచ్చింది.



7

ఏథర్ ఎలక్ట్రిక్ షోరూమ్ ప్రారంభం



వాహనాలను ప్రారంభిస్తున్న మురళీకృష్ణన్ తదితరులు

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వీటీ ఆటోమోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని విద్యుత్ కాలనీ వద్ద ఏథర్ ఎలక్ట్రిక్ షోరూమ్‌ను ఏథర్ ఎనర్జీ లిమిటెడ్ జోనల్ హెడ్ మురళీకృష్ణన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏథర్ వెహికల్స్ ఈ ప్రాంతానికి తీసుకురావడం ఎంతో ఆనందాన్ని ఇస్తుందన్నారు. షోరూమ్‌లో కంపెనీ తాజా ఎలక్ట్రిక్ వాహన మోడల్స్ అన్నీ ఉన్నాయన్నారు. ఇందులో ఇటీవల విడుదలైన 450 సీరిస్ జెన్-5, ఫ్యామిలీ స్కూటర్ రిజ్టా మోడల్స్ కూడా ఉన్నాయన్నారు. ఆధునిక డిజైన్‌లో టచ్ స్క్రీన్ ఫీచర్లు, కొత్త రంగులు, మెరుగైన రేంజ్ వంటి అప్‌గ్రేడ్ ఆప్షన్లు కస్టమర్లకు అందుబాటులో ఉన్నాయన్నారు. షోరూమ్ ప్రారంభం సందర్భంగా రూ.18,500 వరకూ పండుగ ఆఫర్లు, ప్రత్యేక రాయితీలు ఇస్తున్నామన్నారు. కొత్త రిటైల్ షోరూమ్ ప్రారంభం ద్వారా ఏథర్ ఎనర్జీ రాష్ట్రంలోని నల్లగొండ జిల్లా వరకు తన వ్యాపార విస్తరణలో ఒక కీలకమైన మైలురాయిని చేరుకుందన్నారు. ఈ సందర్భంగా వీటీ ఆటోమోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ తేజ పవన్‌కుమార్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌లో తమకు ఒక ఏథర్ షోరూమ్ ఉందన్నా రు. తమ పని తీరు నచ్చి నల్లగొండలో మరో అవకాశం ఇచ్చారన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల్లో ఏథర్ అత్యంత ప్రాధాన్యం కలిగిన వాహనమన్నారు. నెంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాలు బాగా అమ్ముడవుతున్నాయన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. ఈ వాహనాలు కస్టమర్లకు పెట్రోల్ ఖర్చుల నుంచి విముక్తి కల్పిస్తాయన్నారు. స్టైలిష్‌గా ఉంటాయన్నారు. మహబూబ్‌నగర్‌లో మార్కెట్ షేర్ 30శాతం ఉందన్నారు. నల్లగొండలో కూడా సమానమైన మార్కెట్ షేర్ సాధించడమే లక్ష్యమన్నారు. దసరా సీజన్‌లో కస్టమర్ల కోసం ఆకర్షణీయమైన ఆఫర్లు ఉన్నాయన్నారు. ఏదైనా పాత వాహనాన్ని ఏథర్ వాహనంతో ఎక్స్ఛేంజ్ చేసుకునే సౌలభ్యం ఉందన్నారు. తక్కువ డౌన్ పేమెంట్, తక్కువ వడ్డీ రేట్లతో ఫైనాన్స్ సౌకర్యాన్ని అందిస్తున్నామన్నారు. కస్టమర్ల సౌలభ్యం కోసం నల్లగొండలో కొన్ని చార్జింగ్ స్టేషన్లు కూడా ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో ఏథర్ ఎనర్జీ రీజినల్ మేనేజర్ కెవిన్ హెన్రీ, నెట్‌వర్క్ మేనేజర్ శామంత్, వీటీ ఆటోమోటివ్స్ డైరెక్టర్ విద్యాధర్ పాల్గొన్నారు.

సాగర్ ఎడమకాల్వలో యువకుడు గల్లంతు

- వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామ శివారులో ఘటన



6

ఆధ్యాత్మిక బాటలో అతివలు



తిరుపతిలో సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న మఠంపల్లికి చెందిన మహిళా బృందం(ఫైల్)

(ఆంధ్రజ్యోతి-మఠంపల్లి)

సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన పలువురు శ్రీ వాసవి మహిళా సేవా సమితి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక బాటలో ముందుకు సాగుతున్నారు. ఆలయాల్లో, క్షేత్రాల్లో పర్వదినాల్లోనే కాకుండా ఇతర రోజుల్లో జరిగే సేవలకు వెళ్తున్నారు. ఎక్కడ ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరిగినా మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన ఈ సంఘానికి పిలుపు వస్తుంది. దూర ప్రాంతమైనా వెళ్లి ఆలయాల్లో ఆధ్యాత్మిక క్రతువులో పాల్గొంటున్నారు. దేవాలయాల వార్షికోత్సవాలు, బ్రహ్మోత్సవాలు, దేవాలయాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు మాత్రమే కాకుండా తిరుమల శ్రీవారి సన్నిధిలో, యాదగిరిగుట్ట, మట్టపల్లి వంటి దేవాలయాల్లోనూ భజన కార్యక్రమాలకు వెళ్తున్నారు. రాష్ట్రంలోనే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లోని పలు దేవాలయాలను చుట్టొస్తున్నారు. తాజాగా మఠంపల్లి నుంచి 30మంది మహిళలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతి క్షేత్రానికి వెళ్లి సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆలయాల్లో సేవా కార్యక్రమాలంటే ఇష్టం



ఆలయాల్లో సేవా కార్యక్రమాలు చేయడం అంటే ఇష్టం. తిరుపతిలో సేవకు ఎప్పుడు అవకాశం దొరికినా వెళ్తుంటా. ఇప్పటికే పలుమార్లు వెళ్లొచ్చా. తెలంగాణలోని అన్ని దేవాలయాల్లో జరిగే క్రతువులకూ హాజరవుతున్నా.

- కుక్కడపు సంధ్యారాణి, మఠంపల్లి

సంప్రదాయాలు తెలుస్తాయని...



ఆలయాల్లో జరిగే ఆధ్యాత్మిక ప్రసంగాలు వినటమంటే ఎంతో ఇష్టం. అక్కడ సంస్కృతి, సంప్రదాయాలు, ఆయా దేవాలయాల చరిత్ర తెలుస్తుంది. రాష్ట్రంలో ప్రసిద్ధ ఆలయాల్లో జరిగే ముఖ్య కార్యక్రమాల్లో పాల్గొంటుంటా. తీరిక సమయల్లో టీవీల్లోనూ చూస్తుంటా.

- కుక్కడపు కవిత మండల వాసి

దైవ క్రతువులకు మొదటి ప్రాధాన్యం...



దైవకార్యక్రమాలు ఎక్కడ జరిగినా హాజరవుతా. తెలంగాణలోని ఆలయాలను దర్శించుకునేందుకు ఎక్కువప్రాధాన్యం ఇస్తా.తిరుపతిసేవా క్రతువులకు వెళ్తుంటా. తీరిక సమయాలలో భజన కార్యక్రమాల్లో పాల్గొంటా.

- చీదెళ్ల స్వాతి, మఠంపల్లి

మా సమితికి మంచి స్పందన



శ్రీ వాసవి మహిళా సేవా సమితి సంఘం చేస్తున్న సేవా కార్యక్రమాలపై భక్తుల నుంచి మంచి స్పందన ఉంది. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో వాటి పవిత్రత కాపాడుకునేందుకు అందరూ కృషి చేయాలి. ప్రసిద్ధ దేవాలయాల్లో అవకాశం వచ్చినప్పుడల్లా మా సంఘం ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం ఆనందంగా ఉంటుంది.

- కొత్త శ్యామల, మఠంపల్లి

ఉపాధి కోల్పోతాం.. ఫ్లైఓవర్ నిర్మించొద్దు



పెట్రోల్ బాటిల్ పట్టుకుని నిరసన తెలుపుతున్న వ్యాపారులు

తిరుమలగిరి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో ఉపాధి కోల్పోతామని, వెంటనే పనులు నిలిపివేయాలని సూర్యాపేట జిల్లా తిరుమలగిరి పట్టణానికి చెందిన చిరువ్యాపారులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తిరుమలగిరి పట్టణంలో చేపడుతున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులను అడ్డుకుని ఆందోళన చేపట్టారు. పెట్రోల్ బాటిళ్లు పట్టుకుని పనులు చేపట్టేందుకు వచ్చిన వాహనాలకు అడ్డుగా కూర్చుని, గౌరెల్లి-కొత్తగూడెం రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఫ్లైఓవర్ బ్రిడ్జితో ఉపాధి అవకాశాలు లేకుండా పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళనలో మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీష్, ఎల్సోజు భాస్కర్, కందుకూరి ప్రవీణ్, కొత్తగట్టు మల్లయ్య, గుండా భాస్కర్, గజ్జెల శేఖర్, శ్రీహరి, అక్కల నరేష్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలుశిక్ష, జరిమానా

సూర్యాపేట క్రైం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనాలు నడిపిన పలువురికి జైలు శిక్ష, జరిమానా విధించినట్లు సూర్యాపేట ట్రాఫిక్ ఎస్‌ఐ సాయిరాం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 21న డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా మోతాదుకు మించి మద్యం తాగిన ఆరుగురు పట్టుబడినట్లు తెలిపారు. వారిని సోమవారం సూర్యాపేట ద్వితీయ శ్రేణి కోర్టులో హాజరుపర్చగా ఒకరికి ఒకరోజు జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా, మిగిలిన ఐదుగురికి కలిపి రూ.5 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి పీవీ రమణ తీర్పు చెప్పినట్లు తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరిగి విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని పేర్కొన్నారు.

ఉద్యోగం పేరుతో మోసం, కేసు నమోదు


వలిగొండ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ ఎస్‌ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం వలిగొండ మండల కేంద్రానికి చెందిన కొల్లోజు ప్రేమ్ 2024లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి గురునాథ్‌పల్లికి చెందిన బాసాని నర్సింహ నుంచి రూ.50వేలు తీసుకున్నాడు. అయినా ఉద్యోగం ఇప్పించలేదు సదరు బాధితుడు ఉద్యోగం గురించి ఒత్తిడి చేసినా ఫలితం కనబడలేదు. ఇదిలా ఉండగా నర్సింహ ఓ కంపెనీలో ఉద్యోగానికి వెళ్లగా ప్రొఫైల్ బ్యాక్‌గ్రౌండ్ తనిఖీ చేశారు. అంతకుముందే బ్యాన్ అయిన కంపెనీలో నకిలీ పీఎఫ్ ఉందని గమనించి రిజెక్ట్ చేశారు. ఆ ఫేక్ కంపెనీ అకౌంట్‌ను క్లియర్ చేస్తే ఉద్యోగం వస్తుందని తెలుసుకున్న బాధితుడు ప్రేమ్ దృష్టికి తీసుకెళ్లాడు. అతడు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో విసుగు చెంది పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు



పున్నమ్మ

నాగారం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు సూర్యాపేట జిల్లా నాగారం ఎస్‌ఐ అయిలయ్య తెలిపారు. తిరుమలగిరి గ్రామానికి చెందిన బోడ పున్నమ్మ(46) నాగారం మండలంలోని మామిడిపల్లి గ్రామంలోని కుమార్తె పేరాల మమత ఇంటికి ఈ నెల 1న వచ్చింది. మధ్యాహ్నం సూర్యాపేటకు వెళ్లి వస్తానని బయలుదేరి తిరిగి ఇంటికిరాలేదు. పున్నమ్మ కుమార్తె మమత నాగారం పోలీసుస్టేషన్‌లో సోమవారం ఫిర్యాదుచేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712686039, 8143262997 ఫోన్ నెంబర్లకు సమాచారం అందించాలన్నారు.



యాదగిరిగుట్ట క్షేత్రంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

బాలాత్రిపురసుందరీదేవిగా....

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా దేవీశరన్నవరాత్రోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల వేడుకల్లో మొదటిరోజు బాలాత్రిపురసుందరీదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. పలువురు భక్తులు అమ్మవారి మాలధారణతో దీక్ష తీసుకున్నారు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల హోమాధికాలు, పూజలు కొనసాగాయి. అన్నిచోట్ల దేవీ మండపాలను సుందరంగా అలంకరించారు.



హాలియాలో కేఎస్ యూత్ ఆధ్వర్యంలో బాలత్రిపురసుందరిదేవిగా అమ్మవారు



నల్లగొండలోని రాక్‌హిల్స్‌లో అమ్మవారి వద్ద పూజల్లో పాల్గొన్న భక్తులు



చిలుకూరులోని రామాలయం వద్ద చిన్నారుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు



భూదాన్‌పోచంపల్లిలోని మార్కండేశ్వరస్వామి దేవాలయంలో కుంకుమపూజ



సూర్యాపేటలోని సంతోషిమాత దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



దేవరకొండ పాతరామాలయంలో అమ్మవారి విగ్రహం వద్ద భక్తులు



దేవరకొండ వాసవికన్యకాపరమేశ్వరి దేవాలయంలో హోమంలో పాల్గొన్న భక్తులు

ఖిల్లాపై పొంచి ఉన్న ప్రమాదం

● దసరా సెలవులతో పెరిగిన పర్యాటకుల రద్దీ



ఖిల్లాపై ఒరిగిన విద్యుత్ స్తంభం

(ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)

యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని భువనగిరి ఖిల్లాపై పర్యాటకులకు ప్రమాదం పొంచి ఉంది. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రమాదాలకు గురికావాల్సిన పరిస్థితి నెలకొంది. సుమారు 50ఏళ్ల కిందట భువనగిరి ఖిల్లాపై అప్పటి పోలీస్ యంత్రాంగం కమ్యూనికేషన్ సెంటర్ ఏర్పాటుచేసింది. ఈ ప్రాంతంలోని పోలీసుల కమ్యూనికేషన్‌కు ఈ కేంద్రం కీలకం. పోలీసుల వాకీటాకీ ఫోన్లు ఖిల్లాపై ఉన్న కేంద్రం సిగ్నల్స్ ఆధారంగానే పనిచేస్తుంటాయి. ప్రస్తుతం కేంద్ర నిర్వహణ రాచకొండ పోలీస్ కమ్యూనికేషన్ విభాగం పరిధిలో ఉండగా, కేంద్రానికి విద్యుత్ కనెక్షన్ కోసం అప్పట్లో హనుమాన్‌వాడ నుంచి ఖిల్లాపైకి ఇనుప స్తంభాలు ఏర్పాటుచేశారు. అయితే ఖిల్లా పైభాగంలో ఇనుపస్తంభం తుప్పుపట్టి రెండువారాల క్రితం విరిగి విద్యుత్‌తీగల రాయిపై పడింది. పక్కనే ఉన్న మరో స్తంభం తీగలు ప్రమాదకరంగా కిందికి వేలాడుతున్నాయి. ఖిల్లాపై పడిపోయిన ఈ తీగల ద్వారానే విద్యుత్ సరఫరా అవుతోంది. దీంతో అక్కడికి వెళ్లే పర్యాటకులు అవగాహన లోపం లేదా ఏమరుపాటుతో విద్యుత్‌తీగలపై కాలు పెట్టినా, తక్కువ ఎత్తుతో వేలాడుతున్న తీగలను తాకినా ప్రమాదం సంభవించే అవకాశాలు ఉన్నాయి. విద్యుత్ తీగల పునరుద్ధరణపై పర్యాటకశాఖ, రాచకొండ పోలీసులు, విద్యుత్‌శాఖ మాటలతోనే సరిపుచ్చుతున్నాయి. పైగా కూలిన స్తంభంతో ముప్పులేదని అంటూనే త్వరలోనే సరిచేస్తామని పేర్కొంటున్నారు. దసరా సెలవులతో పర్యాటకుల రద్దీ పెరిగిన నేపథ్యంలో సరిచేయాలని పర్యాటకులు కోరుతున్నారు.

కుమార్తెను హత్య చేసిన తండ్రి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య

సూర్యాపేట క్రైం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : అభంశుభం తెలియని ఏడాది వయసున్న కుమార్తెను హత్యచేసిన తండ్రిని అరెస్ట్ చేసినట్లు సూర్యాపేట జిల్లా కేంద్ర పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపారు. సోమవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. నాగారం మండలం డీ-కొత్తపల్లి గ్రామానికి చెందిన గైగుళ్ల వెంకటేష్ యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండలానికి చెందిన కవితను వివాహమాడాడు. ఏడాది తర్వాత ఇద్దరి మధ్య గొడవలు జరగడంతో పెద్దల సమక్షంలో విడిపోయారు. అనంతరం 2023లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా సిరిగిరిపాడు గ్రామానికి చెందిన నాగమణితో రెండో వివాహమైంది. అనంతరం కొన్నాళ్ల పాటు గ్రామంలోనే జీవించారు. వారికి 2024 అక్టోబరు 10న కుమార్తె భవిజ్ఞ జన్మించింది. కొంతకాలంగా మద్యం సేవిస్తూ ప్రతి రోజూ భార్యతో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో నిన్ను, కుమార్తెను చంపి మళ్లీ మూడో పెళ్లి చేసుకుంటానని అంటుండడంతో భయంతో భార్య నాగమణి రెండు నెలల క్రితం తల్లిగారింటికి వెళ్లింది. ఇటీవల పెద్దమనుషులు, వెంకటేష్ కుటుంబసభ్యులు భార్య నాగమణికి సర్దిచెప్పి కాపురానికి తీసుకవచ్చారు. ఇటీవల సూర్యాపేటలోని ప్రియాంక కాలనీలో ఓ ఇల్లును అద్దెకు తీసుకున్నారు. ఈ నెల 19న రాత్రి వెంకటేష్ మద్యం సేవించి వచ్చి భార్యతో గొడవపడ్డాడు. భార్య నాగమణిని కొడుతుండగా కుమార్తె భవిజ్ఞ నిద్రలేచి ఏడుస్తూ తల్లి దగ్గరికి వెళ్లింది. ఆ సమయంలో నిందితుడు వెంకటేష్ భార్య నాగమణి కుడిచేతిని కొరికి ఆమెను గొడకు నెట్టివేసి 11నెలలు కుమార్తె భవిజ్ఞ రెండు కాళ్లు పట్టుకుని నేలకు గట్టిగా బాదాడు. దీంతో భవిజ్ఞ తలకు తీవ్రగాయాలై మృతి చెందింది. భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసినట్లు సీఐ తెలిపారు. కాగా విశ్వసనీయ సమాచారం మేరకు నిందితుడు వెంకటేష్ సోమవారం తన ద్విచక్రవాహనంపై సూర్యాపేట నుంచి జనగాం రోడ్డు వైపు వెళ్తుండగా అంజనాపురి కాలనీ క్రాస్ రోడ్డు వద్ద అదుపులోకి తీసుకుని కోర్టుకు రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. సమావేశంలో సిబ్బంది జానీ, రవి ఉన్నారు.

అనుమానమే పెనుభూతమై

రోకలిబండతో హత్యచేసిన భర్త



రేణుక(ఫైల్)

దేవరకొండ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానం హత్యకు దారితీసింది. ఆదివారం రాత్రి నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణం చంద్రగిరి కాలనీలో ఈ సంఘటన జరిగింది. దేవరకొండ సీఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దేవరకొండకు చెందిన అవిటి గణేష్‌తో రేణుక(35)కు పదేళ్ల కిందట వివాహంకాగా, చంద్రగిరి కాలనీలో నివాసం ఉంటున్నారు. గణేష్ వంటలు చేసి జీవనం సాగిస్తుండగా, వీరికి ఏడేళ్ల కుమారుడు ఉన్నాడు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండగా, ఆదివారం రాత్రి కూడా వివాదం నెలకొంది. రేణుక నిద్రిస్తున్న సమయంలో ఆమె తలపై గణేష్ రోకలిబండతో బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. పక్కనే నిద్రిస్తున్న కుమారుడు లేచి కేకలు వేయడంతో స్థానికులు వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు రేణుక మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్యపై అనుమానమే హత్యకు కారణమని సీఐ వెంకటరెడ్డి తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని, రేణుక తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సాగర్ ఎడమకాల్వలో యువకుడు గల్లంతు



సతీష్

వేములపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సాగర్ ఎడమకాల్వలో యువకుడు గల్లంతైన సంఘటన నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామ శివారులో సోమవారం జరిగింది. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం శెట్టిపాలెం గ్రామానికి చెందిన బొల్లెద్దు సతీష్(32) గ్రామానికి చెందిన మరో పలువురు యువకులతో కలిసి ఎడమకాల్వలో సోమవారం సాయంత్రం ఈతకు వెళ్లాడు. ఈ క్రమంలో రుత్విక్ అనే బాలుడు ఈత సరిగా రాక నీటి ప్రవాహంలో కొట్టుకుపోతుండగా గమనించిన సతీష్ అతడిని కాపాడి ఒడ్డుకు చేర్చి ఆయాసానికి గురై నీటిప్రవాహంలో గల్లంతయ్యాడు. ఈ మేరకు వారి కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం అందించగా కాల్వ వెంట గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభ్యంకాలేదు. ఈ మేరకు గల్లంతైన సతీష్ తమ్ముడు బొల్లెద్దు సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని సాగర్ ఎడమకాల్వ వెంట గస్తీ నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇద్దరికి రిమాండ్

నాగార్జునసాగర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకుని తిరుగుతున్న ఇద్దరిని సోమవారం అరెస్ట్ చేసినట్టు నల్లగొండ జిల్లా సాగర్ ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు. 2022లో ఓ చీటింగ్ కేసులో అరెస్ట్ అయి, కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్న వారిపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యిందన్నారు. నిందితులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వినుకుండలో ఉండగా అక్కడికి వెళ్లి పట్టుకుని నిడమనూరు కోర్టులో హాజరపరిచామన్నారు. నిందితులకు అక్టోబరు 3 వరకు కోర్టు రిమాండ్ విధించిందన్నారు.

జీవితంపై విరక్తితో ఆత్మహత్య



వీరస్వామి(ఫైల్‌ఫొటో)

నేరేడుచర్ల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా నేరేడుచర్లకు చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ రవీందర్ ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నేరేడుచర్ల పట్టణ పరిధిలోని చింతబండలో వీరస్వామి(32) కుటుంబంతో కలిసి నివాసముంటున్నాడు. ఐదేళ్ల నుంచి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ప్రస్తుతం హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురై ఈ నెల 21 రాత్రి స్థానిక వ్యవసాయ మార్కెట్ ఆవరణలోని చెట్టుకు ఉరి వేసుకున్నాడని ఎస్‌ఐ తెలిపారు. వీరస్వామి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని వృద్ధుడు మృతి

మిర్యాలగూడ అర్బన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రైల్వేస్టేషన్ వద్ద సోమవారం జరిగింది. మృతుడి బంధువులు, రైల్వేపోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేములపల్లి మండలం మొల్కపట్నం గ్రామానికి నామిరెడ్డి అనంతరెడ్డి(77) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. చికిత్స నిమిత్తం శనివారం చెన్నై నగరంలోని ఆస్పత్రికి వెళ్లి తిరిగి సోమవారం మిర్యాలగూడకు చేరుకున్నాడు.రైల్వేస్టేషన్ రెండోప్లాట్‌ఫాంపై రైలు దిగిన అనంతరెడ్డి రైల్వే ట్రాక్‌దాటుతున్న క్రమంలో నడికుడి వైపు వెళ్తున్న విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అనంతరెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన రైల్వేపోలీసులు మృతదేహాన్ని స్థానిక ఏరియాఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం పూర్తిచేశారు. అనంతరెడ్డి కుమారుడు శ్రీనివాసరెడ్డి ఫిర్యాదుమేరకు రైల్వే పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని సెక్యూరిటీ గార్డు

చిట్యాల రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వాహనం ఢీకొని ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు మృతి చెందారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి శివారులో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ మమిడి రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన విపుల్‌కుమార్(18) కుటుంబం రాజస్థాన్‌లో నివాసం ఉంటోంది. ఉపాధి నిమిత్తం రాజస్థాన్ ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ ఏజెన్సీ ద్వారా విపుల్‌కుమార్ మండలంలోని గుండ్రాంపల్లి శివారులోని శ్రీపతిల్యాబ్ ఫార్మా పరిశ్రమలో రెండు మాసాలుగా సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. గుండ్రాంపల్లిలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. ఆదివారం విధులు ముగించుకుని రాత్రి ఇంటికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల సమీపంలో యూటర్న్ వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో విపుల్‌కుమార్ రోడ్డుపై పడగా వాహనాలు అతడి పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సెక్యూరిటీ ఏజెన్సీ అధికారి సందీప్‌కుమార్ దూబే ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు.

గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్...



నజీరొద్దీన్(ఫైల్)

మిర్యాలగూడ అర్బన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ మృతి చెందారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సయ్యద్ నజీరొద్దీన్(56) ఆదివారం రాత్రి బతుకమ్మ వేడుకల వద్ద విధులు ముగించుకొని ఇంటికివెళ్లారు. ఛాతినొప్పితో కుప్పకూలగా కుటుంబసభ్యులు స్థానిక ఆస్పత్రికి తరలించగా అప్పటికే పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సూర్యాపేట జిల్లా భీమారం గ్రామానికి చెందిన నజీరొద్దీన్ 1995లో ఉద్యోగంలో చేరారు. కొన్నేళ్లుగా మిర్యాగూడ డివిజన్‌లోనే విధులు నిర్వహిస్తూ పట్టణంలోని శాంతినగర్‌లో స్థిరనివాసం ఏర్పాటు చేసుకుని ఉంటున్నాడు. అతడి మృతికి వన్‌టౌన్ సీఐ నాగభూషణం, టూటౌన్ సీఐ సోమనర్సయ్య, ట్రాఫిక్ ఎస్‌ఐ శ్రీనివాస్, పోలీస్ సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు జయరాజ్, హోంగార్డుల సంఘం జిల్లా నాయకుడు కోడిరెక్క కిరణ్‌కుమార్, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. నజీరొద్దీన్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అమెరికాలో ఉన్న కుమారుడు వచ్చిన అనంతరం నజీరొద్దీన్ అంత్యక్రియలు పోలీస్ లాంఛనాల మధ్య నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు, పోలీస్ అధికారులు తెలిపారు.

మల్లాపురంలో పిడుగుపాటుకు ఆవు మృతి

యాదగిరిగుట్ట రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మల్లాపురంలో పిడుగుపాటుకు ఆవు మృతి చెందింది. భీమానాయక్ పాడి ఆవు సమీపంలో ఆదివారం రాత్రి పిడుగుపడి మృతి చెందింది.

అరచేతిలో వ్యవసాయ సమాచారం

● రైతుల కోసం వాట్సాప్ చానల్



» రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు
» ఆధునిక సాంకేతికత, వ్యవసాయ పరికరాల సమాచారం

మోత్కూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు నేరుగా చేరవేసేందుకు వ్యవసాయ శాఖ కమిషనరేట్ వాట్సాప్ చానల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ రోజుల్లో ఎక్కువ మంది రైతుల వద్ద ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్లు ఉంటున్నాయి. రైతులు సంబంధిత వ్యవసాయ శాఖ విస్తరణాధికారులను (ఏఈవోలను) సంప్రదిస్తే వారు ఆ వాట్సాప్ ఛానల్‌లో చేర్చుతారు. దీంతో వ్యవసాయ రంగంలో కాలానుగుణంగా వస్తున్న మార్పులను, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన సమాచారం, కొత్త రకం పంటలను ఎప్పటికప్పుడు అందులో చేర్చి రైతులకు అందిస్తున్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి, అధిక ఆదాయం పొందేందుకు సలహాలు, సూచనలు అందిస్తారు. పంటల దశను బట్టి, వాతావరణ పరిస్థితులను బట్టి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాడాల్సిన ఎరువులు, క్రిమిసంహారక మందులు తదితర అంశాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తారు. రైతులు అందులో చేరడానికి ఏఈవోలను సంప్రదిస్తే వారు లింక్ పంపుతారు. దాంతో అందులో చేరవచ్చు.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వ్యవసాయ అధికారులు ఈ వాట్సాప్ చానల్‌ను లాగిన్ అయ్యారు. తొలుత ప్రతీ ఏఈవో ఈ యాప్‌ను 100మంది రైతుల సెల్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేయాలని అధికారులు ఆదేశించినట్టు సమాచారం.

ఛానల్‌లో అందనున్న సమాచారం

- » ప్రభుత్వ పథకాలు, సబ్సిడీ వివరాలు
- » పంటల సంరక్షణకు కాలానుగుణ సూచనలు, వాతావరణ హెచ్చరికలు, పంటల సస్యరక్షణకు మార్గదర్శకాలు
- » మార్కెట్ ధరలు, శిక్షణ కార్యక్రమాలు
- » రైతు నేస్తం కార్యక్రమాల షెడ్యూల్
- » వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో నేరుగా సమావేశాలు

వాట్సాప్ చానల్ ఉపయోగకరంగా ఉంది



నేను వాట్సాప్ చానల్‌లో చేరాను. ఈ ఛానల్ చాలా ఉపయోగకరంగా ఉంది. ఏ భూమిలో ఏ పంట వేయాలి? పంటల అధిక దిగుబడికి, తెగుళ్లు సోకినప్పుడు సస్యరక్షణకు తీసుకోవాల్సి చర్యల గురించి తెలుసుకోవడానికి వ్యవసాయ అధికారుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే సెల్‌ఫోన్‌లో సమాచారం అందుతోంది. వాట్సాప్ చానల్‌లో అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు ఇస్తున్న సమచారం బాగానే ఉంటున్నప్పటికీ రైతులకు పంటలపై, ఆధునిక సాంకేతిక పరికరాల వినియోగంపై కలిగే సందేహాలను నివృత్తి చేసుకోవడానికి కూడా ఛానల్‌లో అవకాశం కల్పించాలి. -గోవర్ధన్‌రెడ్డి, సేంద్రియ రైతు, మోత్కూరు

రైతులకు మేలు



రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన వ్యవసాయ వాట్సాప్ ఛానల్ రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. మాటిమాటికీ అధికారుల వద్దకు వెళ్లనవసరం లేకుండా సెల్‌ఫోన్‌లో సమస్త సమాచారాన్ని తెలుసుకునేందుకు ఈ వాట్సాప్ ఛానల్‌ను రూపొందించారు. వివిధ పంటల్లో అధిక దిగుబడులు ఇచ్చే విత్తన రకాలు, పంటల పరిస్థితి, దానికి వాడాల్సిన ఎరువులు, క్రిమీసంహారక మందుల మోతాదు తెలుసుకునే అవకాశం ఉంటుంది.

ఎరువులు, క్రిమి సంహారక మందులు అధికంగా వాడకుండా అధికారులు, శాస్త్రవేత్తలు తగు సూచనలు ఇస్తారు. ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్ ఉన్న ప్రతీ రైతు ఈ చానల్‌లో చేరాలి.

- వెంకటరమణారెడ్డి,జిల్లా వ్యవసాయ అధికారి

సైన్స్‌పై ఆసక్తి ... పెంపొందించేలా..

» కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోవిద్యార్థులకు విజ్ఞాన్ మంథన్ పరీక్ష
» ప్రతిభ చూపిన వారికి ప్రోత్సాహకాలు » దరఖాస్తుకు ఈ నెల 31న ఆఖరు

విద్యార్థుల్లో దాగి ఉన్న ఆవిష్కరణలకు పదును పెట్టేలా పరిశోధనలు, ప్రయోగాల్లో రాణించేలా ప్రతి ఏడాది కేంద్ర ప్రభుత్వం విద్యార్థి విజ్ఞాన్ మంథన్ జాతీయ స్థాయి ప్రతిభ పరీక్షను నిర్వహిస్తుంది. అదే మాదిరిగా ఈ సంవత్సరం కూడా కేంద్ర ప్రభుత్వం శాస్త్ర సాంకేతిక సమాచార సంస్థ ఆధ్వర్యంలో, ఎన్‌సీఈఆర్‌టీ విజ్ఞాన్ ప్రసార్, విజ్ఞాన భారతి సంస్థ సంయుక్తంగా పరీక్ష నిర్వహిస్తుంది. ఇందులో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలతో పాటు దేశంలోని ప్రముఖ పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్, స్కాలర్‌షిప్ లభించనుంది.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట అర్బన్)

సైన్స్‌పట్ల విద్యార్థులకు ఆసక్తి కలిగించడమే ఈ పరీక్ష విధానం లక్ష్యం. ఈ పరీక్షలు రెండు విభాగాల్లో ఉంటాయి. జూనియర్ విభాగంలో 6,7 తరగతుల విద్యార్థులు, సీనియర్ విభాగం లో 9,10, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థు లు పరీక్షకు హాజరుకావచ్చు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్‌తో పాటు 14భాషల్లో ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహిస్తారు. విద్యార్థులు తమ ఆసక్తిని బట్టి భాషను నిర్ణయించుకోవచ్చు. ఇస్రో, డీఆర్‌డీవో, సీఎస్ఐఆర్, బీఏఆర్‌సీ, ఐఐఎస్‌ఈఆర్, ఐఐసీటీ, ఎన్ఐఎన్ వంటి జాతీయ పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్‌నకు అవకాశం ఉంది. అంతేకాకుండా పలు స్కాలర్‌షిప్‌లను అందజేస్తారు. పాఠశాల స్థాయిలో 18మందిని ఎంపిక చేస్తారు. ఒక్కో తరగతి నుంచి ముగ్గురు చొప్పున రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్రస్థాయిలో విజేతలకు రూ.5వేలు, రూ.3వేలు, 2వేలు ఉపకారవేతనం, సర్టిఫికెట్, మెమొంటో అందజేస్తారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థుల్లో మొదటి బహుమతిగా రూ.26 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15వేలు, తృతీయ బహుమతిగా రూ.10వేలు అందజేస్తారు. దీంతో పాటు భాస్కర స్కాలర్‌షిప్ పేరుతో ఏడాది పాటు నెలకు రూ.2వేలు అందజేస్తారు.

దరఖాస్తు ఇలా..

విద్యార్థులు వీవీఎం అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. రూ.200 చెల్లించి ఈనెల 30వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్ష జరిగే రోజున విద్యార్థులు అందుబాటులో ఉన్న మొబైల్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్ వంటి డిజిటల్ పరికరాల్లో ఏదైనా నుంచి నిర్దేశిత అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అప్లికేషన్ ద్వారా పరీక్ష రాయాల్సి ఉంటుంది. విద్యార్థులు ఎక్కడి నుంచైనా పరీక్ష రాయవచ్చు. పరీక్ష సాధన కోసం వెబ్‌సైట్‌లో పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. లెవల్ -1కు సంబంధించిన పాఠశాల స్థాయి పరీక్షలు అక్టోబరు 28నుంచి 30వరకు, జిల్లా స్థాయి పరీక్ష నవంబరు 19న, జాతీయ స్థాయి పరీక్ష 2026 మే నెలలో ఉంటాయి.

తల్లిదండ్రులు విద్యార్థులను పరీక్షకు హాజరయ్యేలా చూడాలి..



విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తిని పెంచి నూతన ఆవిష్కరణల వైపు ప్రోత్సహించడానికి వీవీఎం పరీక్ష దో హదపడుతుంది. విద్యార్థులకు అవగాహన కల్పించి దరఖాస్తు చేసుకునే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలి.

- పోతరాజు ఆనందం, వీవీఎం రాష్ట్ర కోఆర్డినేటర్

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

మిర్యాలగూడ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ అన్నారు. పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సోమవారం ఎమ్మెల్సీ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో పేదలు కార్పొరేట్ స్థాయి వైద్యం పొందేందుకు ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా నిధులు సమకూరుస్తోందన్నారు. అర్హులైన పేదలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని లబ్ధిపొందాలని అన్నారు. 10 మంది లబ్ధిదారులకు 7 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి నర్సిరెడ్డి, వేములపల్లి మండల అధ్యక్షుడు మాలి కాంతారెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కొమ్ము వెంకన్న, తంగెళ్ల సత్తిరెడ్డి, గౌరు రమేష్, బొంగర్ల వినోద్, పగడాల నగేశ్, బోరింగ్ సైదులు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బుద్ధవనంలో నేడు బతుకమ్మ సంబరాలు

నాగార్జునసాగర్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ బుద్ధవనంలో మంగళవారం బతుకమ్మ సంబరాలను నిర్వహిస్తున్నట్టు బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లెపల్లి లక్ష్మయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 21 నుంచి 30వ తేదీ వరకు జరుగుతున్న బతుకమ్మ సంబరాల్లో భాగంగా బుద్ధవనంలో బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బతుకమ్మ సంబరాల్లో పాల్గొనే మహిళలకు నాగార్జునసాగర్ రెండు కాలనీల నుంచి బుద్ధవనానికి రవాణా సౌకర్యం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అంతే కాకుండా న్యాయ నిర్ణేతల నిర్ణయం మేరకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేస్తామని తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ఊరట

(5వ పేజీ తరువాయి)

ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో నాలుగేళ్లపాటు ఈ పథకాన్ని అమలులోకి తీసుకొచ్చినప్పటికీ ఆ తర్వాత ఆరేళ్లపాటు ఈ పథకాన్ని నిలిపివేశారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం పథకాన్ని అమలు చేస్తుంది.

వచ్చే నెల 15లోగా అమలు..

మండలస్థాయిలో త్రీమెన్ కమిటీలు చేసిన తీర్మానాలను ఆధారంగా చేసుకొని జిల్లా స్థాయి కమిటీలు తుది జాబితాను మూడు జిల్లాల కలెక్టర్లకు అందజేస్తారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి యాంత్రీకరణ పథకం అమలుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకు రూ.6.18కోట్లను కేటాయించింది. ఇందులో నల్లగొండ జి ల్లాకు రూ.3.14కోట్లు, సూర్యాపేట జిల్లాకు రూ. 1.84కోట్లు, యాదాద్రి భువనగిరి జిల్లాకు రూ.1.24కోట్లను మంజూరుచేసింది. కేంద్ర ప్రభ ఎత్వం 60శాతం నిధులను, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు మహిళా రైతులకు 50శాతం సబ్సిడీ ఇవ్వనుండగా జనరల్ కేటగిరీ రైతులకు 40శాతం సబ్సిడీ వర్తింపజేస్తారు. వచ్చే నెల 15లోగా దరఖాస్తుల ప్రక్రియను పూర్తి చేయడం, ఆ లోగానే పరికరాలు సైతం పంపిణీ చేయడానికి వ్యవసాయ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. యాంత్రీకరణ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయడమే కాకుండా ఆ పరికరాలను ఏ విధంగా ఉపయోగించాలనే దానిపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. డ్రోన్ల వినియోగం గురించి, ఇతర పరికరాల గురించి ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలుస్తుంది. వచ్చే యాసంగి సీజన్‌లో ఈ పరికరాలను ఉపయోగించేలా రైతులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. అయితే ఈసారి మాత్రం ట్రాక్టర్లను ఈ పథకంలో వర్తింపచేయడంలేదు.

మండల కమిటీల తీర్మానాలను సేకరిస్తున్నాం

వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలుకోసం ప్రభుత్వం ఆదేశాల మేరకు మండలస్థాయిలోని త్రీమెన్ కమిటీల నుంచి తీర్మానాలు సేకరిస్తున్నాం. అర్హులైన రైతులకు మాత్రమే సబ్సిడీ పరికరాలు అందేలా కమిటీల నుంచి పూర్తిస్థాయి నివేదికలను తీసుకుంటున్నాం. జిల్లాస్థాయిలో శాస్త్రవేత్తలతో కలిసి తుదిజాబితాను రూపొందించి కలెక్టర్‌కు అందజేస్తాం. వచ్చేనెల 15 లోగా పథకాన్ని గ్రౌండింగ్ చేయాలని నిర్ణయించాం.

పి.శ్రవణ్ కుమార్, జేడీఏ నల్లగొండ

ఓజీ సినిమా టికెట్ రూ.1.30 లక్షలు

● వేలంలో దక్కించుకున్న అభిమాని ● మొదటి టికెట్‌కు చౌటుప్పల్‌లో వేలం



సినిమా టికెట్‌తో పాటు మెమొంటోను పవన్ కళ్యాణ్ అభిమాని పరమేష్‌కు అందజేస్తున్న జబర్దస్త్ ఆర్టిస్ట్ వినోద్

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పవన్‌కల్యాణ్ నటించిన ఈ నెల 25వ తేదీన విడుదల కానున్న 'ఓజీ' సినిమా మొదటి టికెట్ రూ.1.30లక్షలు పలికింది. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ శ్రీనివాస్ థియేటర్‌లో నిర్వహించిన వేలంపాటలో ఆయన అభిమాని ఆముదాల పరమేష్ రూ.1.30 లక్షలకు టికెట్ దక్కించుకున్నారు. ఒక టికెట్‌కు నిర్వహించిన వేలంలో 100మంది పాల్గొనగా రూ.1.30లక్షలకు వేలం పాడిన పరమేష్‌కు జబర్దస్త్ ఆర్టిస్ట్ వినోద్ (మహిళా వేషధారిణి) టికెట్ అందజేశారు. అనంతరం 'ఓజీ' సినిమా పోస్టర్‌ను ఆవిష్కరించారు. వేలంతో వచ్చిన నగదును జనసేన పార్టీ ఫండ్‌కు అందజేయనున్నట్లు వేలంపాట నిర్వాహకులు, జనసేన చౌటుప్పల్ మండల అధ్యక్షుడు పర్నె శివారెడ్డి, నాయకులు, నందకిషోర్, టి.లింగస్వామి తెలిపారు.

మట్టపల్లిలో పవిత్రోత్సవాలు పరిపూర్ణం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేదపండితులు

మఠంపల్లి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి మహాక్షేత్రంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు సోమవారం పూర్ణాహుతితో ముగిశాయి. ఈ సందర్భంగా వేదపండితులు పుణ్యజలాలతో స్వామికి, జీవధ్వజానికి సంప్రోక్షణ చేశారు. సర్వనది తీర్థాలతో అభిషేకాలు క్రతువులు ముగించి శాంతి కల్యాణం నిర్వహించారు. ఖమ్మం జిల్లా వాసులు బీవీ వాసుదేవాచార్యులు నేతృత్వంలో జరిగిన కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండనవీన్, అర్చకులు టి.శ్రీనివాసచార్యులు, టి.కృష్ణమాచార్యులు, టి.రామాచార్యులు, పద్మనాభాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, బ్రహ్మాచార్యులు, బదరీనారాయణ చార్యులు పాల్గొన్నారు.

34 రోజుల్లో రూ.2 కోట్ల హుండీ ఆదాయం

● యాదగిరిగుట్టలో కానుకల లెక్కింపు



హుండీ కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఖజానాకు 34రోజుల్లో రూ.2కోట్ల హుండీ ఆదాయం సమకూరింది. ఆగస్టు 19వ తేదీ నుంచి ఈ నెల 21వరకు లక్ష్మీనృసింహుడిని దర్శించుకున్న భక్తులు సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. రూ.2,00,83,825 నగదుతోపాటు 65.500 గ్రాముల మిశ్రమ బంగారం, 2.800 కిలోల మిశ్రమ వెండి సమకూరింది. వీటికితోడు 540 అమెరికా 540 డాలర్లు, 95 ఇంగ్లండ్ పౌండ్లు, 6 సౌదీ అరేబియా రియల్, 401 ఒమన్ రియాల్, 40మలేషియా రింగ్గిట్లు, 5 యూరో యూరోలు, 155 యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ధీరమ్, 70 కెనడా డాలర్లు, 250 ఇరాక్ దినార్లు కానుకల రూపంలో విదేశాల కరెన్సీ సమకూరినట్లు ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు. కొండ కింద వ్రత మండపంలో ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి పర్యవేక్షణలో లెక్కింపు ప్రక్రియ కొనసాగింది.

శివాలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానం శివాలయంలో సోమవారం దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో ఉదయం 11.45 గంటలకు విష్వక్సేన పూజ నిర్వహించి స్వస్తివాచనం, రుత్విగ్వరణం, అఖండ దీపారాధన, కలశ స్థాపన వేద మంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాలతో జరిపారు. శ్రీదేవి, బాల త్రిపుర సుందరీ మూలమంత్ర జపాలు, సప్తశతీ, లలిత పారాయణాలు ప్రధానార్చకబృందం నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు నవావరణ, చతుష్షష్ట్యుపచారయుక్త సహస్రనామార్చన, నీరాజన మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ చేసి దేవి త్రికాల పూజలు అర్చకులు చేపట్టారు. వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తి దంపతులు, ఈవో ఎస్. వెంకట్రావు, అర్చకులు పాల్గొన్నారు.

కోదాడలో కోడిపిల్ల బొరిగకు శస్త్రచికిత్స

కోదాడ రూరల్, సెప్టెంబరు22 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడలో కోడిపిల్లకు బొరిగ (స్వరపేటిక)కు అరుదైన శస్త్రచికిత్స చేసినట్లు ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ పి.పెంటయ్య తెలిపారు. కోదాడ పట్టణానికి చెందిన జి.రవికుమార్ ఇంటివద్ద కోళ్లను పెంచుతుండగా, కుక్కల దాడిలో కోడిపిల్లకు బొరిగ పగిలి రక్తం కారుతూ ఇంటికి వచ్చింది. వెంటనే యజమాని కోడిపిల్లను ప్రాంతీయ పశువైద్యశాలకు తీసుకురాగా కోడిపిల్లకు శస్త్ర చికిత్స చేసి బొరిగను కుట్ల ద్వారా అతికించారు. చికిత్స అనంతరం కోడిపిల్లను చూసి యజమాని సంతోషం వ్యక్తం చేశారు సిబ్బంది చంద్రకళ, అఖిల్ పాల్గొన్నారు.

నల్లగొండ ఆర్డీవో అశోక్ రెడ్డికి సీపీవోగా బాధ్యతలు

● ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

నల్లగొండ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి):నల్లగొండ ఆర్డీవో, ఇన్‌చార్జి డీఆర్‌వో వై. అశోక్ రెడ్డికి సీపీవోగా ఎఫ్ఏసీ ప్రాతిపదికన బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల 31న సీపీవో సుబ్బారావు పదవీ విరమణ చేయడంతో సూర్యాపేట అసిస్టెంట్ డైరెక్టర్, సీపీవో ఎల్.కిషన్‌కు నల్లగొండ సీపీవోగా బాధ్యతలు ఇచ్చారు. అయితే సూర్యాపేట జిల్లాలో ఆయన నిరంతరం బాధ్యతలు నిర్వహించాల్సి ఉండడంతో నల్లగొండ సీపీవోగా అదనపు బాధ్యతల వల్ల కార్యకలాపాలకు ఇబ్బందులు తలెత్తిన నేపథ్యంలో ఆర్డీవో అశోక్‌రెడ్డి బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఛీఫ్ ప్లానింగ్ ఆఫీసర్‌గా అశోక్ రెడ్డి కొనసాగనున్నారు. ఈ నేపథ్యంలో సూర్యాపేట సీపీవో కిషన్ నల్లగొండ సీపీవో బాధ్యతల నుంచి సోమవారం రిలీవ్ అయ్యారు.

'2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారమివ్వాలి'

మర్రిగూడ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్ట పరిహారం అందించాలని సీపీఎం నల్లగొండ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని బట్లపల్లి, వట్టిపల్లి గ్రామాలకు చెందిన రైతుల వ్యవసాయ భూములు రింగ్ రోడ్డు పోతున్నందున అక్కడ రైతుల భూములను పరిశీలించారు. వారితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం కోసం తీసుకున్న నిర్ణయం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు భూమికి భూమి, లేదా మూడు వంతుల నష్టపరిహారం చెల్లించడమే కాకుండా ప్రతి ఇంటికి ఉద్యోగం వారికి ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం, ఐలయ్య, నాయకులు ఏర్పుల యాదయ్య, నల్వోజు రామలింగచారి, రైతులు యాదయ్య, చిన్నయ్య, లక్ష్మయ్య, అంజయ్య పాల్గొన్నారు.

నూనెగింజల సాగుతో అధిక లాభాలు



సమావేశంలో మాట్లాడుతున్న కేవీకే శాస్త్రవేత్త నరేష్

ఆత్మకూర్(ఎస్), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంట మార్పిడి చేపట్టి నూనె గింజల సాగు చేయడంతో అధిక లాభాలు పొందవచ్చని కేవీకే గడ్డిపల్లి వ్యవసాయ శాస్త్రవేత్త నరేష్ అన్నారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం తుమ్మలపెన్‌పహాడ్ గ్రామంలో అరవింద కృషి విజ్ఞాన కేంద్రం(గడ్డిపల్లి) ఆధ్వర్యంలో జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా నూనెగింజలు, వేరుశనగ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వేరుశనగ సాగు చేస్తున్న రైతులకు జిగురు అట్టలు, వేపనూనె, సోలార్ దీపాలు, ఎరువులు పంపిణీ చేశారు. వేరుశనగ పంట సాగువిధానం, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. వేరుశనగలో కలుపు నివారణ, నీటి యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. కేవీకే గడ్డిపల్లి వ్యవసాయ శాస్త్రవేత్తలు కిరణ్, సంతోష్ మాట్లాడుతూ.. వేరుశనగ పంటలకు జిప్సం ప్రాముఖ్య చాలా ఉంటుందన్నారు. అనంతరం వివిధ పంటలను క్షేత్రస్థాయిలో పర్యటించి, పరిశీలించారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, చంద్రయ్య, శ్రవణయ్య, క్రాంతి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆలేరులో వాగుల వద్ద వరద ఉధృతి

● ఆలేరు-మంతపురి నిలిచిపోయిన రాకపోకలు




ఆలేరు-మంతపురి గ్రామాల మధ్యన ఉన్న లోలెవల్ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

ఆలేరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పరిసర ప్రాంతాల్లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో లోలెవల్ బ్రిడ్జిపై వాగులు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లే ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆలేరు-మంతపురి గ్రామాల మధ్య ఉన్న ఈదులవాగు బహదూర్‌పేట వాగులు వంగి ప్రవహిస్తుండడంతో గ్రామాలకు వెళ్లే ప్రజలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో స్థానిక మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ మేనేజర్ జగన్మోహన్ వాగుల వద్ద ప్రజలకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. వాగులు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయని ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గం ద్వారా గమ్యాలకు చేరుకోవాలని కోరుతూ హెచ్చరిక బోర్డుల్లో తెలిపారు. కురుస్తున్న వర్షాలు పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని లోతట్టు ప్రాంతాల ప్రజలు ఎగువ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు కమ్యూనిటీ హాల్‌లు పాఠశాలల్లోకి తరలి వెళ్లాలని కూలిపోయే ప్రమాదం ఉన్న ఇళ్ల నుంచి ఖాళీ చేసి ఎగువ ప్రాంతాలకు వెళ్ళాలని సూచించారు. ఏదైనా ప్రమాద పరిస్థితి ఏర్పడితే సెల్ నంబర్ 9849292771ను సంప్రదించాలని సూచించారు.

భక్తులకు సులభతర సేవలు : ఈవో వెంకట్రావు

● యాదగిరికొండపై అందుబాటులోకి కియోస్క్ యంత్రాలు



స్వయం బుకింగ్ కియోస్క్ స్క్రీన్‌పై ఆపరేటింగ్ చేస్తున్న ఈవో వెంకట్రావు

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహులను దర్శించుకునేందుకు తరలివచ్చే భక్తులకు సులభతరమైన సేవలు అందించేందుకు నగదు రహిత సేవలు అందుబాటులోకి వచ్చాయని ఈవో ఎస్.వెంకట్రావు చెప్పారు. యాదగిరికొండపై సోమవారం స్వయం బుకింగ్ కియోస్క్ యంత్రాలను ప్రారంభించి మాట్లాడారు. కొత్తగా ప్రవేశపెట్టిన యంత్రాలతో భక్తులకు మరింత మెరుగైన సేవలు పొందొచ్చన్నారు. దర్శన టికెట్లు, ఆర్జిత సేవలు, ప్రసాదాల కూపన్లు పొందడం, విరాళాలు, హుండీల్లో కానుకలు సమర్పించడం, ఆలయ సమాచారంతో పాటు ఇతర సౌకర్యాలు, పూజల వేళలు, టికెట్లు సులభతరంగా పొందొచ్చన్నారు. భక్తులు స్క్రీన్‌పై టచ్ చేస్తే సులభంగా సేవలు పొందొచ్చన్నారు. వీటి వల్ల క్యూలో నిలబడేందుకు సమయం ఆదా, పారదర్శకం, వేగంగా నగదు రహిత (క్రెడిట్, డెబిట్) సేవలు వినియోగించుకోవచ్చన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈశాన్య దిక్కులోని అఖండ దీపారాధన ప్రాంగణంలో 3, విరాళాల విభాగం 1, కొండకింద వ్రత మండపంలో 1, అద్దె గదుల విభాగం 1 ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తి, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ప్రధానార్చకుడు కాండూరి వెంకటాచార్యులు, మంగళగిరి నరసింహమూర్తి, కిరణాచార్యులు పాల్గొన్నారు. అనంతరం కొండపై యాదగిరి మాస పత్రిక కార్యాలయాన్ని ఈవో వెంకట్రావు అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తితో కలిసి ప్రారంభించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

శాలిగౌరారం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి అన్నారు. మండలంలోని 24గ్రామపంచాయతీలకు ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి మంజూరైన 26 హైమాస్ట్ లైట్లు గ్రామాల్లో ఏర్పాటు చేశారు. ఆకారం గ్రామంలో సోమవారం హైమాస్ట్ లైట్లను సమరంరెడ్డి ప్రారంభించారు. అన్నిగ్రామాల్లో సీసీరోడ్లు నిర్మించినట్లు తెలిపారు. అన్ని గ్రామాల్లో మురుగు కాల్వల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు.

అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

మర్రిగూడ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించేందుకు కుట్ర పన్నుతున్నారని మునుగోడు నియోజకవర్గ గిరిజన విద్యార్థి విభాగం నాయకుడు మెగావత్ చందునాయక్ అన్నారు. సోమవారం మర్రిగూడలో మాట్లాడుతూ లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగిస్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. శాంతియుతంగా హైదరాబాద్‌కు వెళ్తున్న నాయకులను పోలీసులు రాత్రి అరెస్టు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

పాఠశాల క్లోజింగ్ సర్టిఫికేట్ ఇవ్వకుండా నిర్లక్ష్యం



ఎంఈవో అరుంధతికి వినతిపత్రం అందజేస్తున్న చొక్కారావు

నల్లగొండ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): అంధుల పాఠశాల మూసివేత సర్టిఫికేట్ ఇవ్వాలని 2023 ఏప్రిల్‌లో డీఈవో బిక్షపతి వినతిపత్రం ఇచ్చినా పట్టించుకోవడం లేదని డ్వాబ్ ప్రధాన కార్యదర్శి, ఏబీసీ ఉపాధ్యక్షుడు పొనుగోటి చొక్కారావు అన్నారు. జిల్లాకేంద్రంలో ఎంఈవో అరుందతికి సోమవారం అంధుల పాఠశాల మూసివేత సర్టిఫికేట్ కోసం పాఠశాలకు సంబంధించిన రికార్డులు అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంధుల పాఠశాలను నిర్వహించామని, విద్యార్థులు లేకపోవడంతో పాఠశాలను మూసివేసినట్లు తెలిపారు. క్లోజింగ్ సర్టిఫికెట్ డీఈవో ఏ కారణం చేత ఇవ్వలేదో సమాధానం చెప్పాలన్నారు. నల్లగొండ అంధుల పాఠశాలలో చదివిన విద్యార్థులు తమ మార్కుల జాబితాలు, ఇతర ధ్రువపత్రాల కోసం మండల విద్యాధికారిని సంప్రదించాలని కోరారు. పాఠశాలకు సహకరించిన దాతలకు, శ్రేయోభిలాషులకు, కలెక్టర్లకు, ఎస్పీలకు కృతజ్ఞతలు తెలిపారు. డ్వాబ్ అంధుల కోసం భవిష్యత్తులో పోరాటం చేస్తుందని, సామాజిక సేవ కార్యక్రమంలో ఇదే విధంగా భాగస్వాములు అవుతామన్నారు. ఈ కార్యక్రమంలో డ్వాబ్ ఉపాధ్యక్షుడు దేవిరెడ్డి లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

నల్లగొండ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణ సమీపంలో కేశరాజుపల్లిలోని తమ భూమిని ఆక్రమించాలని ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోడిరెక్క యాదగిరి కోరారు. పోలీసు అధికారులు, రెవెన్యూ అధికారులకు సోమవారం వినతిపత్రం అందజేశారు. కేశరాజుపల్లిలో తమ కుటుంబసభ్యులకు చెందిన 1.08 గుంటల భూమిని ఇద్దరు దౌర్జన్యంగా ఆక్రమించుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. ఇటీవల భూమిచుట్టూ ఉన్న కడీలను కూడా విరగగొట్టి భయభ్రాంతులకు గురిచేశారన్నారు. భూమి ఆక్రమణకు సంబంధించి తిప్పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఇప్పటికే వారిపై మూడు కేసులు నమోదయ్యాయని తెలిపారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

చిట్యాలరూరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మలిదశ ఉద్యమకారులకు గత ఎన్నికల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు కూనూరు సంజయ్‌దాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. మండలంలోని తాళ్ళవెల్లంల, గుండ్రాంపల్లి, సుంకెనపల్లి గ్రామాల్లో మలిదశ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల కుటుంబసభ్యులను కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమరవీరుల కుటుంబాలకు, మలిదశ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను ఆదుకుంటామని ఇచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 22 నెలలైనా హామీలు నెరవేర్చలేదన్నారు. 250గజాల స్థలం ఇచ్చి, ఇళ్ల మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో అశోక్, బొడిగె అంజయ్యగౌడ్, జోగు లింగస్వామి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి స్థలం కేటాయించాలి

కనగల్, సెప్టెంబరు 22: (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ భవనానికి మరోచోట స్థలం కేటాయించాలని మండలంలోని రేగట్టే గ్రామానికి చెందిన కుమ్మరి వృత్తిదారులు కోరారు. కుమ్మరి సంఘం మండల అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ సునితకు సోమవారం వినతిపత్రం అందజేశారు. రేగట్టే గ్రామ చెరువు పక్కన ఉన్న స్థలాన్ని ఎన్నో ఏళ్లుగా తాము కుమ్మరివాముగా ఉపయోగించుకుని కుండలు తయారు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నామని పేర్కొన్నారు. అధికారులు ఆ స్థలంలో అంగన్‌వాడీ భవనం నిర్మించేందుకు సర్వే చేశారని తెలిపారు. అంగన్‌వాడీ భవనం సదరు స్థలంలో నిర్మిస్తే తమకు కుండలను తయారు చేసుకునే చోటులేకుండా పోతుందన్నారు. కార్యక్రమంలో బక్కయ్య, కొండయ్య, లింగయ్య, సత్తయ్య, శేఖర్ ఉన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

మునుగోడు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబాపూలే(ఎంజేపీ) బాలుర, బాలికల గురుకుల పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న క్యాటరింగ్ బిల్లులు చెల్లించాలని క్యాటరింగ్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు బొడ్డు నాగరాజుగౌడ్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఇటీవల పెంచిన డైట్‌ఛార్జీలకు అనుగుణంగా క్యాటరింగ్ ఛార్జీలను పెంచాలన్నారు. ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. క్యాటరింగ్ నిర్వాహకులు ఆర్థిక భారంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లేకుంటే ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం లేకపోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించండి సారూ..



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

● ప్రజావాణికి వెలువెత్తిన వినతులు

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బాధితులు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రాలు అందజేశారు. కొందరు వ్యక్తిగత సమస్యలపై తరలిరాగా, మరికొందరు సామజిక సమస్యలపై తరలివచ్చారు. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించగా, మరికొన్ని సమస్యల పరిష్కారానికి అధికారులకు లేఖలు రాశారు.

పట్టా మార్పిడి చేయాలి



మా గ్రామంలోని సర్వే నెంబర్ 35లో ఎనిమిది ఎకరాల 8గుంటల భూమి వంశపారంపర్యంగా సంక్రమిస్తూ వస్తుంది. భూమికి సంబంధించి కబ్జాలో కూడా మేమే ఉండి సేద్యం చేసుకుంటున్నాం. కొందరు అధికారులు చేసిన తప్పుల కారణంగా పట్టాదారు పాస్‌పుస్తకాలు వేరే వ్యక్తుల పేరిట వచ్చాయి. రైతుభరోసా డబ్బులు కూడా వాళ్లకే వెళ్తున్నాయి. రెవెన్యూ అధికారులను కలిసినా భూమిని మా పేరిట పట్టా మార్పిడి చేయడం లేదు. సంవత్సరంగా తిరుగుతున్నా ఫలితం లేదు.

● కొత్త నవరత్నమ్మ, కుదావన్‌పూర్, నల్లగొండ మండలం.

పట్టా ఇప్పించండి



నిరుపేద కుటుంబానికి చెందిన మాకు ప్రభుత్వం 1995లో గ్రామంలోని సర్వే 703లో 20 గుంటల భూమిని మా తండ్రి పేరిట ఇచ్చింది. ఇందుకు సంబంధించి పట్టా మాత్రం ఇప్పటికీ ఇవ్వలేదు. ఎన్నిసార్లు అధికారులను సంప్రదించినా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం ఆ భూమిని సేద్యం చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాం. అధికారులు పట్టా ఇప్పించాలి.

● కిన్నెర రవి, తిప్పర్తి.

ఇందిరమ్మ బిల్లు ఇప్పించాలి



నిరుపేద కుటుంబానికి చెందిన నాకు ఉండడానికి పక్కా ఇల్లు లేదు. ఇందిరమ్మ ఇంటికి దరఖాస్తు చేసుకున్నాను. లబ్ధిదారుల జాబితాలో ఇల్లు మంజురైంది. దీంతో ఫొటోలు కూడా దిగాను. అప్పుసప్పు చేసి బేస్‌మెంట్ లెవల్ వరకు ఇంటి నిర్మాణం చేపట్టాను. కానీ ఇప్పటి వరకు మొదటి బిల్లు మంజూరు కాలేదు. అధికారులను అడిగితే నీకు ఇల్లు మంజూరు కాలేదన్నారు. వచ్చే జాబితాలో నీ పేరు వస్తుందని అని సమాధానం చెబుతున్నారు. బిల్లు వస్తుందని అప్పు చేసి బేస్‌మెంట్ లెవల్ పూర్తి చేశా.

పెరిక ముత్తయ్య, అనంతారం , నల్లగొండ మండలం .

పౌతీ ఇప్పించండి



మేము నిరుపేద కుటుంబానికి చెందిన వారం. మా చిన్నతనంలో అమ్మనాన్న చనిపోవడంతో నేను, నా సోదరుడు ఇద్దరం తాతయ్య ఇంటి వద్ద ఉండి చదువుకున్నాం. మా నాన్న పేరిట గ్రామంలో ఎకరం భూమి ఉంది. ఆ భూమి నా పేరిట మార్చేందుకు పౌతీ చేసుందుకు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోగా, కుటుంబసభ్యుల సరిఫ్టికేట్ అడగగా దానిని కూడా అందజేశాం. కానీ ఆ భూమిని ఇప్పటి వరకూ నా పేరిట మార్చడం లేదు. ఏడాదిగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నాను.

కూర మహాలక్ష్మి, చిన్నఅడిశర్లపల్లి, కొండమల్లేపల్లి మండలం

డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలి



డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో లాటరీ ద్వారా ఎంపికైన డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులకు వెంటనే ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఇవ్వాలని సీపీఎం పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల సాధన పోరాట కమిటీ కన్వీనర్ అవుట రవీందర్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద వంటా వార్పు నిర్వహించి నిరసన తెలిపారు. పది నెలలు క్రితం లాటరీ ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు ప్రొసిడింగ్ ఆర్డర్స్ ఇవ్వాలని అనేక రూపాలలో ఆందోళన చేసినా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంజి నాగరాజు, సిరాజుద్దీన్, విశాలాక్షి ప్రశాంతి, గిరిజ, గంజి రాజేష్ విజయలక్ష్మి, అనురాధ, జహంగీర్ రవి సుల్తాన్ ఇలియాస్ వెంకటమ్మ రజిని యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలరూరల్: మండలంలోని గుండ్రాంపల్లి శివారులోని డబుల్ బెడ్‌రూం ఇళ్లను డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లం మహేష్ సోమవారం పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తిచేయించి పేదలకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు పంది నరేష్, ఉపాధ్యక్షులు ఆడెపు రమేష్, కూనూరు గణేష్, నాయకులు జోగు గణేష్, కూరాకుల బాబు, జోగు మణి తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ డీలర్లు బాధ్యతతో మెలగాలి

నల్లగొండ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంక్ డీలర్లు బాధ్యతతో మెలగాలని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ సూచించారు. జిల్లాకేంద్రంలోని పెట్రోల్ బంక్‌లను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు డీలర్లు బంక్‌ల నిర్వహణను తేలికగా తీసుకుంటున్నారన్నారు. బంక్‌లపై డీలర్ల పర్యవేక్షణ కొరవడిందని చిన్నచిన్న విషయాలకు కూడా సమాధానం చెప్పేందుకు బంక్‌లలో బాధ్యులు ఎవరూ ఉండడం లేదన్నారు. డీలర్లు ఎక్కడో ఉండి బాధ్యత లేకుండా ఉండటం వల్ల సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చమురు సంస్థల అధికారులతో ఆయన ఫోన్‌లో మాట్లాడి కొన్ని బంక్‌లలో నెలకొన్న సమస్యల గురించి వివరించారు. కొన్ని బంక్‌లలో మేనేజర్లు మాత్రమే ఉంటున్నారని, డీలర్లు ఎక్కడో ఉండి బంక్ నిర్వహణ ఎవరికో ఒకరికి ఒప్పజెప్పుతున్నారని ఫోన్‌లో తెలిపారు. అదేవిధంగా వినియోగదారుల పట్ల మర్యాదగా వ్యవహరించి బాధ్యతగా ఉండాలని సూచించారు.

గ్రామాల్లో ప్రతి ఒక్కరినీ సంఘంలో చేర్పించాలి

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో 14 నిండి 18 సంవత్సారాల మధ్య వయస్సు ఉన్నవారిని కిషోర్ బాలికల సంఘాల్లో చేర్పించాలని జిల్లా గ్రామీణ. అదనపు అధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. మండలంలోని అనంతారం, దీపకుంట గ్రామంలో సోమవారం సందర్శించి సంఘాల సభ్యులతో మాట్లాడారు. ప్రతి గ్రామంలో ఇంకా సంఘాల్లో చేరని మహిళలను గుర్తించి కొత్త సంఘాలు ఏర్పాటు చేయించాలన్నారు.

జీఎస్టీ తగ్గింపు పేదలకు వరం

రామగిరి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపు పేద ప్రజలకు వరమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. జీఎస్టీ తగ్గించిన సందర్భంగా ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. వ్యవసాయ పనిముట్లు, పరికరాలు, ట్రాక్టర్లపై జీఎస్టీ హర్షణీయమన్నారు. స్వదేశీ తయారీ వస్తువుల ఉపయోగంతో దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గడ్డం మహేష్, నాయకులు వీరెళ్ళి చంద్రశేఖర్, పకీర్ మోహన్‌రెడ్డి, పోతెపాక లింగస్వామి, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, మండల వెంకన్న, మిర్యాల వెంకన్న, చింత ముత్యాలరావు, దాసోజు యాదగిరి, పిండి పాపిరెడ్డి ఉన్నారు.

ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ తీసుకోవాలి

మర్రిగూడ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ తీసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రభుత్వాధికారిని డాక్టర్ శాలిని, 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ శంకర్‌నాయక్ అన్నారు. స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని 30 పడకల సామాజిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య శిబిరం నిర్వహించారు.

చిట్యాల: మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ లావణ్య సూచించారు. పోషణమాసం సందర్భంగా చిట్యాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి అందుతున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏసీడీపీవో వెంకటమ్మ, డీపీఎం మోహన్ రెడ్డి, పీఎం శ్రీదేవి, అవుల మాధవి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలి

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా నాయకుడు వంశీ, రవి డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రవణ్, కిరణ్, గణేష్, శ్రవణ్ రమేష్, నరేష్, జీవన్ పాల్గొన్నారు.

వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

నల్లగొండ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని రామనగర్‌లో ఉన్న ఓ శిక్షణా కేంద్రంలో లైంగిక వేధింపులకు పాల్పడడంతో పాటు అవినీతికి పాల్పడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గండిచెర్వు వెంకన్న డిమాండ్ చేశారు. అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. శిక్షణా సంస్థలో డైరెక్టర్‌గా పనిచేస్తున్న వ్యక్తి అక్కడకు శిక్షణకు వచ్చే మహిళలతో పాటు అందులో పనిచేస్తున్న ఉద్యోగులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బాధిత మహిళ షీటీమ్‌కు కూడా ఫిర్యాదు చేసిందని తెలిపారు. ఫేక్ బిల్లులు పెడుతూ డబ్బులు కాజేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

న్యూయార్క్ బతుకమ్మ వేడుకల్లో గోపాల్‌రెడ్డికి సన్మానం



న్యూయార్క్ నగరంలో గోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రతినిధులు

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అమెరికా న్యూయార్క్ నగరంలోని న్యూజెర్సీ చాప్టర్ ఆధ్వర్యంలో తెలంగాణ అమెరికా తెలుగు అసోసియేషన్ (టీటీఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న మండలంలోని బీ.వెల్లెంల గ్రామానికి చెందిన పర్యావరణవేత్త ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ జాతీయ సలహాదారు కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డిని టాటా సభ్యులు సన్మానించారు. బతుకమ్మ వేడుక ప్రాశస్త్యాన్ని గోపాల్‌రెడ్డి వారికి వివరించారు. ఈ వేడుకల్లో టీటీఏ సలహాదారు పటోళ్ల మోహన్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ కొల్ల శివరెడ్డి, పెరిక నర్సింహ్మా, మురళీధర్‌రెడ్డి, విలాస్‌రెడ్డి, దొంతిరెడ్డి నర్సింహ్మారెడ్డి పాల్గొన్నారు.

నేతన్నల రుణమాఫీ పథకం అమలు చేయాలి

మునుగోడు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు చేనేత కార్మికుల రుణమాఫీ పథకం అమలు చేయాలని చేనేత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు చెరుకు సైదులు డిమాండ్‌చేశారు. మండలకేంద్రంలో సోమవారం జరిగిన చేనేత కార్మికుల సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సంఘం నాయకులు మిర్యాల అశోక్, సింగం శివయ్య, చిలుకూరు మధు, కర్నాటి రాజు, చెరుపల్లి రాము, సింగం గిరి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

‘వీధిలైట్ల’కు దసరా వెలుగొచ్చేనా?

(5వ పేజీ తరువాయి)

ఇవ్వాల్సి ఉంటుంది.

సుమారు రూ.5కోట్ల మేర ఇండెంట్‌లు?

వీధిలైట్ల సరఫరా కోసం జిల్లా అధికారులు సూచిస్తున్న ఇండెంట్ల మొత్తం సుమారు రూ.5కోట్ల వరకు ఉండొచ్చని అంచనా. ఉదాహరణకు ఒక్క నార్కట్‌పల్లి మండలంనుంచే వీధిలైట్ల బల్బుల కోసం సుమారు రూ.20లక్షల అంచనా విలువైన ఇండెంట్ పంపినట్లు సమాచారం. ఈ లెక్కన జిల్లాలో 31 మండలాల పరిధిలోని చిన్నా, పెద్ద అన్ని మండలాలను పరిగణలోకి తీసుకుంటే సుమారు రూ.5కోట్ల మేర ఇండెంట్లు వచ్చే అవకాశమున్నట్లు అంచనా.

దసరాకు వెలుగులు వచ్చేనా?

గతంలో గ్రామపంచాయతీలు స్థానిక వ్యాపారుల వద్ద తమకు అవసరమైన వాట్స్‌ల బల్బులను కొనుగోలు చేసుకుని వీధిలైట్లకు అమర్చేవి. వీటికిగాను పంచాయతీ కార్యదర్శులు మండల పంచాయతీరాజ్ ఇంజనీర్‌తో ఎంబీ రికార్డు చేయించి బిల్లు పెట్టుకునేవారు. ప్రస్తుతం జీపీల్లో నెలకొన్న నిస్సహాయస్థితిని గమనించి జిల్లా అధికారులు డీపీసీని ఏర్పాటుచేశారు. డీపీసీ నిర్ణయించిన రేటు మేరకే వేలం ద్వారా కాంట్రాక్ట్ పొందిన కాంట్రాక్టర్ వీధిలైట్లను సరఫరా చేయాల్సి ఉంది. కాంట్రాక్ట్ పొందిన టెండర్‌దార్లు అన్ని గ్రామ పంచాయతీలకు ఒకే సమయంలో వీధిలైట్లు సరఫరా చేయగలుగుతారా? దసరా రెండు మూడు రోజుల్లో ఉండగా సరఫరా చేస్తే వాటన్నింటినీ పండుగ లోపు బిగించడం సాధ్యమేనా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ నెల 25 లోపు వీధిలైట్లను అందజేస్తేనే తాము పండగ నాటికి బిగించడం సాధ్యమవుతుందని ఓ పంచాయతీ కార్యదర్శి అభిప్రాయం వ్యక్తంచేశారు.

అరువుపై స్ట్రీట్‌లైట్లు ఇవ్వడం లేదు

గతంలో దసరా పండుగ సమయంలోనే కాకుండా ఇతర సాధారణ రోజుల్లో కూడా అవసరమైనపుడు స్ట్రీట్‌లైట్లను అరువు పెట్టి తెచ్చాం. కానీ రెండేళ్ల బిల్లులు మంజూరు కాకపోవడంతో ఎలక్ట్రికల్ సామగ్రిని ఇచ్చేందుకు వ్యాపారులు నిరాకరిస్తున్నారు. డీఎల్‌పీసీ నిర్ణయించిన రేట్లకే లెడ్ బల్బులను సరఫరా చేస్తున్న అక్షయ ట్రేడర్స్‌కు మాకు కావల్సిన ఇండెంట్ పెట్టాం.

సుభాన్, పంచాయతీ కార్యదర్శి, నార్కట్‌పల్లి

గ్రామసభ ఆమోదం పొందాలి

స్ట్రీట్‌లైట్లకు తప్పనిసరిగా గ్రామసభ ఆమోదం ఉండాలి. ఇండెంట్ ప్రకారం కొనుగోలు చేసిన బిల్లులను సంబంధిత పీఆర్ ఏఈ ద్వారా ఎంబీ రికార్డు చేయించి వాటి ఖర్చుకు కూడా గ్రామసభ ఆమోదం పొంది తీర్మానం కాపీని జతచేయాల్సి ఉంది. ఆయా వాట్స్‌ల వారీగా డీఎల్‌పీసీ నిర్ణయించిన ధరకంటే తక్కువ రేట్లకే ఎల్‌ఈడీ స్ట్రీట్‌లైట్లు ఎవరైనా జీఎస్‌టీ చెల్లింపుదారైన ఎలక్ట్రికల్ వ్యాపారి విక్రయిస్తే వారి వద్ద నుంచి కొనుగోలు చేసే అవకాశం కూడా గ్రామ పంచాయతీలకు ఇచ్చాం. వెంకయ్య, డీపీవో, నల్లగొండ జిల్లా.



కనగల్‌లో బాలాత్రిపురసుందరీదేవిగా ఎల్లమ్మ తల్లి



శాలిగౌరారంలో..

బాలా త్రిపురసుందరీదేవిగా..



నార్కట్‌పల్లిలోని 13వ వార్డులో దుర్గామాత పూజల్లో పాల్గొన్న భక్తులు



చిట్యాల కనకదుర్గ ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వీరేశం



కనగల్ : పూజల్లో పాల్గొన్న భక్తులు



నల్లగొండ పట్టణంలోని రాక్‌హిల్స్‌కాలనీలో పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 28.5
కనిష్ఠం 22.5
ANDHRAJYOTHY
నల్లగొండ
5
మంగళవారం 23 సెప్టెంబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.60 (305.50)	3,32,150	3,32,150
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.70 (4.12)	65950.62	5651.42
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	170.831 (39.5561)	2,89,300	3,14,300

చికెన్ ధరలు | లైవ్ : రూ.160 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.255

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ఊరట

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ఊరట లభించనుంది. గతంలో యాంత్రీకరణ పరికరాలపై పెద్ద ఎత్తున అంటే 18శాతం వరకు జీఎస్టీ ఉండేది. ప్రస్తుతం ఐదు శాతానికి తగ్గడంతో పరికరాల ధరలు తగ్గుముఖం పట్టాయి. అదే విధంగా యాంత్రీకరణ పథకాన్ని పారదర్శకంగా అమలు చేయడం కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ శాఖ మండల స్థాయిలో త్రీమెన్ కమిటీల నుంచి తీర్మానాలను సేకరిస్తుంది.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ)



- తగ్గనున్న 15 రకాల యంత్రాల ధరలు
- యాంత్రీకరణకు త్రీమెన్ కమిటీల తీర్మానాలు
- జిల్లా కమిటీలకు మండలస్థాయి అధికారుల సిఫారసులు
- వచ్చే నెల 15లోగా పరికరాల పంపిణీకి సన్నాహాలు

యాంత్రీకరణ పథకం అమలు కోసం ముందుగా త్రీమెన్ కమిటీల తీర్మానాలు చేపడుతున్నారు. ఈ కమిటీలో తహసీల్దార్, మండల వ్యవసాయ అధికారి, ఎంపీడీవో ఉంటారు. వీరు ముగ్గురు ఆయా మండలాల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన జాబితాను జిల్లా కమిటీలకు సిఫారసు చేస్తారు. జిల్లా కమిటీలో జిల్లా వ్యవసాయ అధికారులతోపాటు శాస్త్రవేత్తలు తుది జాబితాను ఎంపికచేసి ఆయా జిల్లా కలెక్టర్లకు సమర్పిస్తారు. ఇప్పటికే రెండుసార్లు వివిధ కారణాలతో వాయిదా పడిన నేపథ్యంలో పథకాన్ని త్వరగా పూర్తి చేయాలని నిర్ణయించారు. యూరియా కోసం రైతులు పెద్దఎత్తున క్యూకట్టిన నేపథ్యంలో తెలంగాణలోని అన్ని జిల్లాలతోపాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, నల్లగొండ జిల్లాలో ఈ పథకాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారు.

పరికరాల ధరలు తగ్గుముఖం

కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ స్లాబ్‌లను నాలుగు నుంచి రెండు చేయడంతోపాటు సామాన్య ప్రజలపై భారం పడకుండా మార్పులు చేశారు. దీంతో రైతులపై కూడా భారం తగ్గనుంది. గతంలో యాంత్రీకరణ పరికరాలపై పెద్ద ఎత్తున అంటే 18శాతం వరకు జీఎస్టీ ఉండేది. ప్రస్తుతం 5శాతానికి తగ్గడంతో పరికరాల ధరలు తగ్గుముఖం పట్టాయి. జీఎస్టీ తగ్గించడంతో ఆయా కంపెనీలు కూడా వ్యవసాయ శాఖ అధికారులకు తగ్గించిన రేట్లను సవరించి పంపడంతో పథకంలో చేర్పులు మార్పులు చేస్తున్నారు. పథకం అమలు కంటే ముందే జీఎస్టీ తగ్గడంతో రైతులకు ఎంతో ప్రయోజనం ఉందని చెప్పవచ్చు. మొత్తం 15 రకాల పరికరాలకు సంబంధించి ధరలు తగ్గనున్నాయి. ఆధునిక వ్యవసాయాన్ని ప్రోత్సహించడంకోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని పునరుద్ధరించింది. పరికరాల్లో ప్రధానంగా రోటోవేటర్లు, నాగళ్లు, కల్టివేటర్లు, స్ప్రేయర్లు, పవర్ వీడర్లు, డ్రోన్లు ...

- మిగతా 7వ పేజీలో...

బాలా త్రిపుర సుందరిదేవిగా దర్శనం



నల్లగొండలోని రాక్‌హిల్స్ కాలనీలో బాలా త్రిపుర సుందరిదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

నల్లగొండ కల్చరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తొమ్మిది రోజులపాటు నిర్వహించే దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభయ్యాయి. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారికి పూజలు నిర్వహించారు. తొలిరోజు బాలా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

భూసేకరణ ప్రక్రియను పూర్తిచేయాలి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల నిర్మాణంలో భాగంగా మిగిలిపోయిన భూసేకరణ ప్రక్రియను ఈనెలాఖరు లోగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం ఆయన సచివాలయం నుంచి జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణ పనులకు అవసరమైన భూ సేకరణపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దసరా పండుగకు ముందే అన్ని జాతీయ రహదారుల భూసేకరణ పనులు పూర్తి కావాలన్నారు. కోర్టు కేసులు ఉన్న భూములకు సంబంధించి పూర్తి వివరాలను వెంటనే ప్రభుత్వానికి పంపాలన్నారు. టైటిల్ సమస్యలు ఉన్న భూముల విషయంలో పరిహారం మొత్తాన్ని డిపాజిట్ చేసి, భూములను సేకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రహదారి నిర్మాణ పనుల్లో జాప్యం జరగకుండా ప్రతీ కేసును అత్యంత ప్రాధాన్యంగా పరిగణించాలన్నారు. భూసేకరణలో ఎలాంటి ఆలస్యం జరుగకూడదన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఇలాత్రిపాఠి, ఇన్‌చార్జీ డీఆర్‌వో అశోక్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీధర్ రెడ్డి, జాతీయ రహదారుల సంస్థ ఈఈ మురళి, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' దరఖాస్తులను పరిష్కరించాలి

అదనపు కలెక్టర్(రెవెన్యూ) జె. శ్రీనివాస్

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన కలెక్టరేట్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా అధికారులు ఫిర్యాదులపై వెంటనే స్పందించి పరిష్కరించాలని, అదేవిధంగా ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో మండల, గ్రామస్థాయిలో పనిచేసే వారి సిబ్బందికి ఇదేవిధంగా ఆదేశించాలన్నారు. కాగా ఈసోమవారం మొత్తం 72 దరఖాస్తులు రాగా, ఇందులో రెవెన్యూ శాఖకు 46, మిగతావి వివిధ శాఖలకు సంబంధించి వచ్చాయి. ఈ సోమవారం ఎప్పటిలాగే వ్యక్తిగత అంశాలు, భూములకు సంబంధించిన విషయాలు, తదితర అంశాలపై ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయి. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్ కుమార్, డీఆర్డీవో శేఖర్‌రెడ్డి, జిల్లా అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

34 రోజుల్లో రూ.2 కోట్లు

- యాదగిరీశుడి హుండీ ఆదాయం



7

వీధిలైట్లకు దసరా వెలుగొచ్చేనా?

- అరువు దొరకక ఇబ్బందిపడిన గ్రామపంచాయతీలు
- అదనపు కలెక్టర్ నేతృత్వంలో డీఎల్‌పీసీ ఏర్పాటు?
- ఎల్‌ఈడీలకు రేట్లను నిర్ణయించిన డీఎల్‌పీసీ
- ఇండెంట్ అడుగుతున్న జిల్లా పంచాయతీ అధికారులు



నార్కట్‌పల్లి గ్రామ పంచాయతీ భవనం, గతంలో జీపీలు కొనుగోలు చేసిన ఎల్‌ఈడీలు, బల్బులు

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల బాధ్యతలో వీధిలైట్ల నిర్వహణ కూడా భాగమే. కానీ రెండేళ్లుగా గ్రామపంచాయతీలు పంపిన బిల్లులు మంజూరు కాకపోవడంతో వీధిలైట్ల నిర్వహణలో చిన్న గ్రామపంచాయతీలు దాదాపు చేతులెత్తేసినంత పనిచేశాయి. పంచాయతీలకు పాలకవర్గాలు కూడా లేకపోవడంతో కొన్ని గ్రామాల్లో అంధకారం అలుముకున్నా పట్టించుకునే వారే లేని పరిస్థితి. మేజర్ గ్రామ పంచాయతీలైతే స్థానిక వ్యాపారుల ద్వారా అరువు తెచ్చి వీధిలైట్ల సమస్య తలెత్తకుండా ఇంతకాలం నెట్టుకొచ్చారు. కానీ బిల్లులు రాకపోవడంతో వీటికి కూడా అరువు దొరకని పరిస్థితి ఎదురైంది. ఈ సమస్యను అర్థం చేసుకున్న కలెక్టర్ జీపీలపై వీధిలైట్ల కొనుగోలు భారం పడకుండా ప్రత్యామ్నాయం చూపారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అధికారి నేతృత్వంలో డీపీవో, సీఈవో, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్‌స్థాయి అధికారులు సభ్యులుగా డీఎల్‌పీసీ (జిల్లా స్థాయి పర్చేజ్ కమిటీ)ని నియమించారు. గ్రామపంచాయతీలకు బ్లీచింగ్ పౌడర్, దోమల నివారణ మందులు, తదితర పారిశుధ్య సామగ్రిని సరఫరా చేసేందుకు ఓపెన్ టెండర్ నిర్వహించి కాంట్రాక్టర్‌ను నియమించిన పద్ధతిలోనే వీధిలైట్ల ఎల్‌ఈడీ బల్బుల సరఫరాకు కూడా బహిరంగ వేలం నిర్వహించారు. నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ డివిజన్‌ల పరిధిలో డీఎల్‌పీసీ నిర్ణయించిన రేట్లకే వీధిలైట్లు సరఫరా చేసే కాంట్రాక్ట్‌ను అక్షయ ట్రేడర్స్ చేజిక్కించుకుంది.

ఊపిరిపీల్చుకున్న జీపీ కార్యదర్శులు

దసరా వస్తుండటంతో గ్రామపంచాయతీ కార్యదర్శుల్లో టెన్షన్ మొదలైంది. రోజువారీగా వీధిలైట్ల నిర్వహణ ఎలా ఉన్నా దసరాకు మాత్రం దాదాపు అన్ని గ్రామాల్లో వీధిలైట్లను వేయాల్సి ఉంటుంది. అయితే గతేడాది వరకు జీపీల్లో డబ్బులు లేకున్నా అరువు తెచ్చి వీధిలైట్లతో గ్రామాల్లో ఎలాగోలాగ 'వెలుగు'లు నింపేవారు. కానీ రెండేళ్లుగా వీధిలైట్లు ఇతర సామగ్రి కొనుగోలుకు సంబంధించి ఎంబీలు సమర్పించినా బిల్లులు రాకపోవడంతో వ్యాపారులు కూడా అరువు ఇచ్చేందుకు విముఖత చూపుతున్నట్లు తెలుస్తోంది. దీంతో సొంత డబ్బులతో వీటిని సమకూర్చాల్సి వస్తుందేమోనన్న ఆందోళన పంచాయతీ కార్యదర్శుల్లో వ్యక్తమైంది. ఈ సమయంలో డీఎల్‌పీసీ బహిరంగ వేలం నిర్వహించి ఎల్‌ఈడీ బల్బులను సరఫరా చేసే కాంట్రాక్టర్‌ను నియమించడంతో పంచాయతీ కార్యదర్శులపై కాస్త భారం తగ్గినట్లయింది.

డీఎల్‌పీసీ నిర్ణయించిన ధరలివే..

గ్రామ పంచాయతీల్లో అవసరమయ్యే ఐదు రకాల ఎల్‌ఈడీ (లెడ్) బల్బులకు డీఎల్‌పీసీ నిర్ణయించిన ధరలు ఇలా ఉన్నాయి. 24 వాట్స్ లెడ్ స్ట్రీట్‌లైట్ ఒకదానికి రూ.1200, 36 వాట్స్ లెడ్ స్ట్రీట్‌లైట్‌కు రూ.1600, 50 వాట్స్ లెడ్ స్ట్రీట్‌లైట్‌కు రూ.2400, 28 ఎంఎం ఐరన్ క్లాంప్ విత్ పైప్‌కు రూ.300, 15 వాట్స్ లెడ్ బల్బ్ విత్ హోల్డర్‌కు రూ.300 చొప్పున డీఎల్‌పీసీ ధర నిర్ణయించింది. ఈ మేరకే బహిరంగ వేలం ద్వారా సరఫరా హక్కు పొందిన కాంట్రాక్టర్ డీఎల్‌పీసీ నిర్ణయించి పై ధరల్లోపే ఇండెంట్ పెట్టిన గ్రామ పంచాయతీలకు సరఫరా చేయాల్సి ఉంది.

ఇండెంట్ అడుగుతున్న అధికారులు

దసరా పండుగ దగ్గర పడుతుండటంతో ఎల్‌ఈడీ వీధిలైట్ల సరఫరాకోసం జిల్లా అధికారులు మండలాల నుంచి ఇండెంట్ అడుగుతున్నారు. దీంతో మండలస్థాయిలో ఎంపీవోలు గత రెండు రోజులుగా గూగుల్ మీట్‌లో ప్రధాన ఎజెండాగా వీధిలైట్ల ఇండెంట్‌ను ప్రస్తావించి త్వరగా ఇండెంట్ పెట్టేలా పంచాయతీ కార్యదర్శులను ఆదేశిస్తున్నారు. ఏయే వాట్స్ బల్బులు.. ఎన్నికావాలో ఇందుకోసం రూపొందించిన ఫార్మట్‌లో ఇవ్వాల్సి ఉంది. అయితే డీఎల్‌పీసీ నిర్ణయించిన రేట్ల మేరకే ఇవి సరఫరా చేయబడుతున్నా వీటి కొనుగోలు కయ్యే డబ్బులు మాత్రం సంబంధిత గ్రామ పంచాయతీయే సరఫరాదారుకు చెక్కులు...

మిగతా 8వ పేజీలో...

ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు

కలెక్టర్ ఇలాత్రిపాఠి

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఇలాత్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీరోజు పలు శాఖల ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ నెల 23న బుద్ధవనంలో ప్రత్యేకంగా బతుకమ్మ ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. 23న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, డీసీహెచ్‌ఎస్, యువజన సర్వీసులు, కార్మిక, మెప్మా శాఖలు ఎన్జీ కళాశాల మైదానంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించాలన్నారు. 24న వ్యవసాయ, ఉద్యాన, సెరీకల్చర్, హ్యాండ్లూమ్స్, పశుసంవర్థక శాఖలు, 25న మునిసిపల్, ట్రాన్స్‌కో, ఫిషరీస్, సంక్షేమ శాఖలు, 26న డీఆర్డీఏ, డీపీవో, సీపీవో, ఆర్టీసీ, మెప్మా ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించాలన్నారు ఈ నెల 27న అటవీ, పోలీస్, ఎక్సైజ్, ఫైర్, ఆర్టీవో, మెప్మా శాఖలు, 28న రెవెన్యూ, దేవాదాయ, సహకార, పౌరసరఫరాల, టీఎన్జీవో, సర్వేల్యాండ్‌రికార్డ్స్ ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించాలన్నారు. 29న జిల్లా విద్యాశాఖ, అన్ని ఇంజనీరింగ్ శాఖలు, మెప్మా, ఈ నెల30 న బార్ అసోసియేషన్, రోటరీ క్లబ్, రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించాలన్నారు. నల్లగొండ ఆర్డీవో బతుకమ్మ ఉత్సవాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, మునిసిపల్ కమిషనర్ ఎన్జీ కళాశాల మైదానంలో లైటింగ్, డయాస్, తాగునీరు, ఇతర ఏర్పాట్లు చేయాలని, పోలీస్‌శాఖ తరపున అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. బుద్ధవనంలో నిర్వహించే బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా మిర్యాలగూడ సబ్ కలెక్టర్, నందికొండ మునిసిపల్ కమిషనర్, బుద్ధవనం స్పెషల్ ఆఫీసర్, పెద్దవూర తహసీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ వహించి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు.

ప్రశాంతంగా నిర్వహించుకోవాలి : ఎస్పీ

దుర్గమాత నవరాత్రి ఉత్సవాలు, బతుకమ్మ సంబరాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఎస్పీ శరత్ చంద్రపవార్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్సవాలు జరిగే ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్‌శాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసిందన్నారు. బతుకమ్మ సంబరాల్లో మహిళలు, యువతులపై వేధింపులు, ఈవ్‌టీజింగ్‌లకు పాల్పడకుండా నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా ఆకతాయిలు వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రీవెన్స్‌డేలో ఫిర్యాదుల పరిశీలన

జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్‌డే సందర్భంగా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పలు ఫిర్యాదులను పరిశీలించారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డేకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 37మంది అర్జీదారులు వచ్చి ఎస్పీని కలిసి తమ సమస్యలను తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వర న్యాయం చేయాలని ఆదేశించారు.

బసవేశ్వరుడి విగ్రహం ఏర్పాటు చేయాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తొలి సంఘ సంస్కర్త బసవేశ్వరుడి విగ్రహాన్ని జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేయాలని బసవేశ్వర విగ్రహ ప్రతిష్ఠ సాధన కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11వ శతాబ్దంలోనే సమాజంలోని కుల, మత వర్ణ, వర్గ, లింగ బేధాలు రూపు మాపేందుకు కృషిచేసిన మహోతన్నతుడు బసవేశ్వరుడని అని కొనియాడారు. ప్రస్తుతం నడుస్తున్న పార్లమెంట్‌కు దిక్సూచిగా నాడు బసవేశ్వరుడు నిర్వహించిన అనుభవ మండపం నిలుస్తుందన్నారు. పార్లమెంట్‌లో బసవేశ్వరుడి విగ్రహం ఏర్పాటుచేసి, ప్రతి ఏటా జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నారన్నారు. అంతటి మహోన్నత వ్యక్తి విగ్రహం జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా పట్టణంలో బసవేశ్వరుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ఇమ్మడి పరమేష్, గౌరవాధ్యక్షుడు దొడ్డ శాంతికుమార్, ప్రధాన కార్యదర్శి ధర్మశెట్టి కోటి, కార్యనిర్వాహక అధ్యక్షుడు పొగాక నాగరాజు, కోశాధికారి కర్నె వరప్రసాద్, ఉపాధ్యక్షులు ఉప్పు శేఖర్, బొజ్జ నాగరాజు, వెంబడి లింగప్ప, పత్తి వినయ్‌కుమార్, కర్నె ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అరచేతిలో వ్యవసాయ సమాచారం

- రైతుల కోసం వాట్సాప్ చానల్



వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు నేరుగా చేరవేసేందుకు వ్యవసాయ శాఖ కమిషనరేట్ వాట్సాప్ చానల్‌ను అందుబాటులోకి తెచ్చింది.



7

ఏథర్ ఎలక్ట్రిక్ షోరూమ్ ప్రారంభం



వాహనాలను ప్రారంభిస్తున్న మురళీకృష్ణన్ తదితరులు

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : వీటీ ఆటోమోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని విద్యుత్ కాలనీ వద్ద ఏథర్ ఎలక్ట్రిక్ షోరూమ్‌ను ఏథర్ ఎనర్జీ లిమిటెడ్ జోనల్ హెడ్ మురళీకృష్ణన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏథర్ వెహికల్స్ ఈ ప్రాంతానికి తీసుకురావడం ఎంతో ఆనందాన్ని ఇస్తుందన్నారు. షోరూమ్‌లో కంపెనీ తాజా ఎలక్ట్రిక్ వాహన మోడల్స్ అన్నీ ఉన్నాయన్నారు. ఇందులో ఇటీవల విడుదలైన 450 సీరిస్ జెన్-5, ఫ్యామిలీ స్కూటర్ రిజ్టా మోడల్స్ కూడా ఉన్నాయన్నారు. ఆధునిక డిజైన్‌లో టచ్ స్క్రీన్ ఫీచర్లు, కొత్త రంగులు, మెరుగైన రేంజ్ వంటి అప్‌గ్రేడ్ ఆప్షన్లు కస్టమర్లకు అందుబాటులో ఉన్నాయన్నారు. షోరూమ్ ప్రారంభం సందర్భంగా రూ.18,500 వరకూ పండుగ ఆఫర్లు, ప్రత్యేక రాయితీలు ఇస్తున్నామన్నారు. కొత్త రిటైల్ షోరూమ్ ప్రారంభం ద్వారా ఏథర్ ఎనర్జీ రాష్ట్రంలోని నల్లగొండ జిల్లా వరకు తన వ్యాపార విస్తరణలో ఒక కీలకమైన మైలురాయిని చేరుకుందన్నారు. ఈ సందర్భంగా వీటీ ఆటోమోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ తేజ పవన్‌కుమార్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌లో తమకు ఒక ఏథర్ షోరూమ్ ఉందన్నా రు. తమ పని తీరు నచ్చి నల్లగొండలో మరో అవకాశం ఇచ్చారన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల్లో ఏథర్ అత్యంత ప్రాధాన్యం కలిగిన వాహనమన్నారు. నెంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. మార్కెట్లో ఎలక్ట్రిక్ వాహనాలు బాగా అమ్ముడవుతున్నాయన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. ఈ వాహనాలు కస్టమర్లకు పెట్రోల్ ఖర్చుల నుంచి విముక్తి కల్పిస్తాయన్నారు. స్టైలిష్‌గా ఉంటాయన్నారు. మహబూబ్‌నగర్‌లో మార్కెట్ షేర్ 30శాతం ఉందన్నారు. నల్లగొండలో కూడా సమానమైన మార్కెట్ షేర్ సాధించడమే లక్ష్యమన్నారు. దసరా సీజన్‌లో కస్టమర్ల కోసం ఆకర్షణీయమైన ఆఫర్లు ఉన్నాయన్నారు. ఏదైనా పాత వాహనాన్ని ఏథర్ వాహనంతో ఎక్స్ఛేంజ్ చేసుకునే సౌలభ్యం ఉందన్నారు. తక్కువ డౌన్ పేమెంట్, తక్కువ వడ్డీ రేట్లతో ఫైనాన్స్ సౌకర్యాన్ని అందిస్తున్నామన్నారు. కస్టమర్ల సౌలభ్యం కోసం నల్లగొండలో కొన్ని చార్జింగ్ స్టేషన్లు కూడా ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో ఏథర్ ఎనర్జీ రీజినల్ మేనేజర్ కెవిన్ హెన్రీ, నెట్‌వర్క్ మేనేజర్ శామంత్, వీటీ ఆటోమోటివ్స్ డైరెక్టర్ విద్యాధర్ పాల్గొన్నారు.

సాగర్ ఎడమకాల్వలో యువకుడు గల్లంతు

- వేములపల్లి మండలం శెట్టి పాలెం గ్రామ శివారులో ఘటన



6

వాహనదారులు నిబంధనలు పాటించాలి

చింతపల్లి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): వాహనదారులు నిబంధనలు పాటించాలని ఎస్ఐ రాంమూర్తి తెలిపారు. సోమవారం మండలంలోని గొడకొండ్ల రిజర్వాయిర్ చెక్‌పోస్టు సమీపంలో వాహనదారులకు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం మత్తులో వాహనాలు నడపవద్దని సూచించారు. అతివేగంతో పాటు మద్య సేవిస్తే వారిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట సిబ్బంది సైదులు, శ్రీనివాస్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

దామరచర్ల, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని మెహదీపట్నం తైక్వాండో అసోసియేషన్‌లో సోమవారం నిర్వహించిన తైక్వాండో పోటీల్లో దామరచర్ల మండలంలోని రమేష్ తైక్వాండో అకాడమిలోని విద్యార్థులు దేవకీనందన్, కేశగోని జ్ఞానదీప్, అన్నెం అఖిల్‌రెడ్డి, కొప్పుల అశోక్‌రెడ్డి, బండెలగం అనిల్‌కుమార్, గోలి దేవేంద్రనాథ్ ప్రతిభ చాటినట్లు మాస్టర్ రమేష్ తెలిపారు. విద్యార్థులకు తైక్వాండో అసోసియేషన్ సెక్రటరీ ఎర్రవల్లి ప్రవీణ్‌కుమార్ బ్లాక్ బెల్టులు అందజేశారు.

అన్నదాతలను ఆదుకోవడంలో ముందుంటా



ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): అన్నదాతలను ఆదుకునేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. వ్యవసాయ నిధికి రూ.2కోట్లు అందజేసిన ఎమ్మెల్యేకు వృత్తినిపుణులు సోమవారం కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం బాగుంటే సమాజం మంచిగా ఉంటుందన్నారు. తెలంగాణ యువజన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు, రీసెర్చ్‌స్కాలర్ దాసరి శశాంకర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే బీఎల్ఆర్ విద్య, ఉపాధి, వ్యవసాయ రంగాలకు అండగా నిలవడం హర్షణీయమన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజలకు దగ్గరైన బీఎల్ఆర్ బ్రదర్స్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో యువరాణి, దయామణి, రఫీ, కృష్ణచంద్, భీమేష్, జ్యోత్స్న, వహీద్, జ్యోతి పాల్గొన్నారు.

వేములపల్లి: మండలంలోని మొల్కపట్నం గ్రామానికి చెందిన నల్లగంతుల శివ మృతిచెందాడు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సోమవారం మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్టల కృపయ్య, పేరెల్లి నగేష్, బారి పాండు, రాచూరి వెంకన్న, కొమ్మనబోయిన ఆంజనేయులు, మంగమ్మ, జెర్రిపోతుల సైదులు, మహేష్, దుర్గాప్రసాద్ ఉన్నారు.

ప్రయాణికులకు రోడ్డు గండం

● ఏళ్లుగా కొలిక్కిరాని భీమారం- సూర్యాపేట రహదారి ● పనులు గుంతలమయంగా మారుతున్న రోడ్డు



లక్ష్మీదేవిగూడెం సమీపంలో ఏర్పడిన భారీ గుంత

వేములపల్లి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): నిత్యం పెద్దసంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే భీమారం- సూర్యాపేట రోడ్డుకు ఏళ్ల గడుస్తున్నా పనులు పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. గత పాలకులు నిర్లక్ష్యమా, అధికారుల అలసత్వం వహించడమా కారణమేదైనా రోడ్డు పనులు పూర్తి కాలేదని, ప్రస్తుత ప్రభుత్వంలో జిల్లాకు చెందిన మంత్రి, ఆర్అండ్‌బీ మంత్రి కావడంతో ప్రజలు ఆశాభావం వ్యక్తం చేసినప్పటికీ రోడ్డు నిర్మాణం ముందుకు సాగడం లేదు. ఇటీవల ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేములపల్లి మండలం శెట్టిపాలెం సమీపంలోని అద్దంకి- నార్కట్‌పల్లి రహదారి నుంచి సూర్యాపేట పట్టణం వరకు 28 కిలో మీటర్ల మేర డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టడానికి తొమ్మిదేళ్ల క్రితం రెండు విడతలుగా రూ.49.5కోట్ల నిధులు మంజూరయ్యాయి. 2019 నాటికి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ నేటికి అసంపూర్తిగా ఉన్నాయి. రోడ్డు నిర్మాణ పనులు పూర్తయితే రెండు జిల్లాలతోపాటు మిర్యాలగూడ నుంచి సూర్యాపేటకు తక్కువ సమయంలో ప్రయాణించడానికి వీలుంటుంది. ఈ మార్గం ద్వారా మిర్యాలగూడ నుంచి సూర్యాపేటకు వందలాది వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి.

పూర్తికాని కల్వర్టులు

భీమారం- సూర్యాపేట రోడ్డు నిర్మాణంలో భాగంగా చేపట్టాల్సిన కల్వర్టుల ఆధునీకరణ ఇప్పటివరకు కూడా పూర్తి కాలేదు. నిర్మాణంలో 9 బాక్స్ కల్వర్టులు ఉండగా, గూనల ద్వారా నిర్మించాల్సిన కల్వర్టులు సుమారు 50కిపైగా ఉన్నాయి. బాక్స్ బ్రిడ్జి నిర్మాణాల్లో ఆరు నిర్మాణం పూర్తికాగా మరో మూడు పెండింగ్‌లో ఉన్నాయి. పూర్తయిన బ్రిడ్జిల వద్ద కూడా మట్టిపోయకపోవడం వల్ల ప్రయాణీకులు తాత్కాలిక రోడ్డుపై ప్రయాణించాల్సి వస్తుంది. గూనల నిర్మాణంలో సుమారు 30 నిర్మాణాలు పూర్తికాగా మరో 20 పెండింగ్‌లో ఉన్నాయి. ప్రతి ఐదు కిలోమీటర్లకు ఒక చోట రోడ్డు తవ్వి గుంతలు ఏర్పడడంతో ప్రయాణానికి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిత్యం ఈ కల్వర్టులపై ద్విచక్ర వాహనదారులు ఎక్కడో ఒకచోట అదుపుతప్పి పడిపోయి తీవ్ర గాయాలు కాగా పలువురు మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి.

రోడ్డు విస్తరణ పనులు పూర్తిచేయాలి



చాలా ఏళ్లుగా రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయకపోవడంతో రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు ఇబ్బందులు గురవుతున్నారు. రోడ్డుపైన కల్వర్టులు అసంపూర్తిగా వదిలి వేయడంతో భారీస్థాయిలో గుంతలు ఏర్పడి ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి పడిపోవడంతో గాయాలకు గురవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టనట్లుగా వ్యవహరించడం సరికాదు.

● పాదూరి శశిధర్‌రెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి.

రేపటి నుంచి పోషణ్ మాసోత్సవాల ఫొటో ఎగ్జిబిషన్

మిర్యాలగూడ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న పోషన్ మాసోత్సవాల ఫొటో ఎగ్జిబిషన్‌ను ఈ నెల 24వ తేదీ నుంచి 26 వరకు మిర్యాలగూడలో నిర్వహిస్తున్నట్లు సెంట్రల్ బ్యూరో కమ్యూనికేషన్ నల్లగొండ జిల్లా శాఖ సహాయ సంచాలకులు జి. కోటేశ్వరరావు తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. మహిళాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖతో కలిసి నిర్వహిస్తున్న ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీలు ఎంసీ కోటిరెడ్డి, కేతావత్ శంకర్‌నాయక్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్ అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు.

బీఎస్పీ సభకు తరలివెళ్లిన నాయకులు

హాలియా, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): నార్కెట్‌పల్లిలో నిర్వహించిన బీఎస్పీ సభకు పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రావులపాటి రవిశంకర్ అధ్వర్యంలో నాయకులు సోమవారం బయలుదేరి వెళ్లారు. హాలియా బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. రాష్ట్రంలో మహనీయుల ఆశయాలను కొనసాగింపుగా ఉన్న ఏకైక పార్టీ బీఎస్పీ అని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు జిల్లా శేఖర్, షేక్ సోయల్, శివ, ప్రభాకర్, అనిల్, కిరణ్‌నాయక్ పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి



జెండా ఎగురవేస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఐద్వా జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాదూరి గోవర్ధన, జిల్లా కమిటీ సభ్యులు మునగాల అరుణ పిలుపునిచ్చారు. ఐద్వా ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. 2026 జనవరి 25 నుంచి 28వ తేదీ వరకు రాష్ట్ర రాజధానిలో ఆలిండియా మహాసభలు జరగనున్నాయన్నారు. సభలకు జాతీయ, రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కంచర్ల ఊర్మిళ, జానకమ్మ, పద్మ, లక్ష్మమ్మ, రజియాబేగం, లింగమ్మ పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమాజంలో మార్పు



సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి

మిర్యాలగూడ రూరల్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పోరాటాలతోనే సమాజం మార్పు వస్తుందని, ఆ పోరాటాలు సాగించే కమ్యూనిస్టు పార్టీలకే భవిష్యత్తు ఉంటుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కన్నెకంటి రంగయ్య సంస్మరణ సభలో రంగయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగయ్య చేసిన పోరాటాలు, త్యాగాలను నేటి కార్యకర్తలు గుర్తు చేసుకొని భవిష్యత్తు ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. అనేక ఉద్యమాలు, పోరాటాలు చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, నూకల జగదీశ్చంద్ర, రవినాయక్, చౌగాని సీతారాములు, రాగిరెడ్డి మంగారెడ్డి, రెమిడాల పరుశురాములు, అయూబ్, రమేష్, గోవర్ధన, అరుణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారిని నళినిని ఆదుకోవాలి



మాట్లాడుతున్న నాయకులు

మిర్యాలగూడ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారిని, మాజీ పోలీస్ అధికారి నళిని ప్రభుత్వం ఆదుకోవాలని బీసీ జేఏసీ డివిజన్ నాయకులు మారం శ్రీనివాస్, బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథ కోరారు. సోమవారం స్థానిక బీసీ భవన్‌లో జరిగిన బహుజన సంఘాల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర సాధన ఉద్యమంలో డీఎస్పీ పదవికి రాజీనామా చేసి నాడు కేంద్రానికి బలంగా నిరసన సెగ తాకేలా చేసిన నళిని ప్రస్తుతం అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నందున ప్రభుత్వం ఆమెను అన్ని రకాలుగా ఆదుకోవాలని కోరారు. ఉద్యమకారులను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి నిపుణుల పర్యవేక్షణలో వైద్యసేవలు అందించాలని కోరారు. సమావేశంలో దాసరాజు జయరాజు, చేగొండి మురళి, బాసాని గిరి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

నాంపల్లి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): నాంపల్లి మండల కేంద్రంలోని రైతుసేవా కేంద్రం, మనగ్రోమర్, తిరుమల ఫర్టిలైజర్స్ నందు యూరియా ఈనెల 23న అందుబాటులో ఉంటుందని మండల వ్యవసాయశాఖ అధికారి శివ తెలిపారు. మండలంలోని రైతులు ఆయా కేంద్రాలకు వచ్చి యూరియా బస్తాలు తీసుకోవాలని కోరారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా యూరియాను అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

దేశభక్తిని పెంపొందించుకోవాలి




మాట్లాడుతున్న మంత్రిప్రగడ శ్రీధర్‌జీ

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ, దేశభక్తిని పెంపొందించుకోవాలని ఆర్ఎస్ఎస్ విభాగ్ కార్యవాహ మంత్రిప్రగడ శ్రీధర్‌జీ అన్నారు. పట్టణంలో సోమవారం జరిగిన విజయదశమి ఉత్సవాల్లో మాట్లాడారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శత వసంతాల కార్యక్రమాలను దేశమంతా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ధర్మం, దేశం కోసం పాటుపడుతూ తిరుగులేని శక్తిగా ఎదగడం సమష్టి కృషి ఫలితమేనన్నారు. దసరా ఉత్సవాలను పట్టణంలోని 12బస్తీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్బీఐ చీఫ్ మేనేజర్ గవ్వల నరేష్ సంఘ్ ప్రతినిధులనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా సహ వ్యవస్థ ప్రముఖ్ చెరుపల్లి కరుణాకర్, గాయం నరేందర్‌రెడ్డి, యామిని వెంకటేశ్వర్లు, పాల్వాయి సురేష్, వనపర్తి శ్రీనివాస్, కనపర్తి సత్యప్రసాద్, సుధాకర్, శ్రీనివాసాచారి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గాంధీ జయంతి రోజు మాంసం విక్రయించొద్దు

దేవరకొండ, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): గాంధీ జయంతి అక్టోబరు 2వ తేదీ రోజు దేవరకొండ మున్సిపాలిటిలో రోజు మాంసం విక్రయించొద్దని మునిసిపాలిటీ శానిటరి ఇన్‌స్పెక్టర్ సురిగి శంకర్ కోరారు. సోమవారం పట్టణంలోని చికెన్, మటన్, నాన్‌వెజ్ విక్రయదారులు, వ్యాపారులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రతి ఒక్కరూ వ్యాపార లైసెన్స్ తీసుకోవాలన్నారు. పరిశుభ్రత పాటించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ అధికారులు శక్రునాయక్, శరత్, వెంకటయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలి



స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్లు

నేరేడుగొమ్ము, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవాలని దేవరకొండ ఐసీడీఎస్ సీడీపీవో చంద్రకళ అన్నారు. సోమవారం నేరేడుగొమ్ము మండలం కొత్తపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో పౌష్టిక ఆహారంపై అవగాహన కల్పించి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పౌష్టిక ఆహారం అందిస్తుందని తెలిపారు. అనంతరం బతుకమ్మ ఆటలు ఆడారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శోభ, మేరి, టీచర్లు అరుణ, సువార్త, మమత, అజిత తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ: దేవరకొండ మండలం బొడ్డుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. జనరల్ ఫిజిషియన్ డాక్టర్ మస్తాన్, పీహెచ్‌సీ డాక్టర్ విజయ, అలియా అజుం వైద్య ఆరోగ్య శిబిరంలో మహిళలకు వివిధ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ప్రత్యేక ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ సూపర్‌వైజర్లు వినోద్, లింగయ్య, సరిత, గణేష్, చంద్రకళ, మౌనిక, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బ్యాంక్ ద్వారా సేవలు అందించాలి

తిరుమలగిరి(సాగర్), సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజవరంలో గల యూనియన్ బ్యాంక్ ద్వారా తమకు సేవలు అందించాలని కృష్ణపట్టెకు చెందిన వినియోగదారులు కోరారు. సోమవారం జిల్లా అధికారులకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ నాయకుడు మెరావత్ మునినాయక్ ఆధ్వర్యంలో జిల్లా పరిపాలన అధికారి మోతీలాల్‌నాయక్, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రామిక్‌లకు సమస్యలు వివరించారు. కృష్ణపట్టె ప్రాంతంలోని పలు గ్రామాల ప్రజలకు నాగార్జునసాగర్‌లో గల కెనరా బ్యాంక్‌లో ఖాతాలు ఉండేవని, ఇటీవల ఆ బ్యాంక్‌ను నాగార్జునసాగర్ నుంచి హాలియాకు మార్చడం వల్ల సుమారు 35కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుందన్నారు. అందువల్ల తమ గ్రామాలకు సమీపంలో ఉన్న రాజవరం యూనియన్ బ్యాంక్ ద్వారా సర్వీస్‌ను అందచేస్తే ఉపయోగంగా ఉంటుందని అధికారులు సానుకూలంగా స్పందించాలని కోరారు.

'వీధిలైట్ల'కు దసరా వెలుగొచ్చేనా?

(5వ పేజీ తరువాయి)

ఇవ్వాల్సి ఉంటుంది.

సుమారు రూ.5కోట్ల మేర ఇండెంట్‌లు?

వీధిలైట్ల సరఫరా కోసం జిల్లా అధికారులు సూచిస్తున్న ఇండెంట్ల మొత్తం సుమారు రూ.5కోట్ల వరకు ఉండొచ్చని అంచనా. ఉదాహరణకు ఒక్క నార్కట్‌పల్లి మండలంనుంచే వీధిలైట్ల బల్బుల కోసం సుమారు రూ.20లక్షల అంచనా విలువైన ఇండెంట్ పంపినట్లు సమాచారం. ఈ లెక్కన జిల్లాలో 31 మండలాల పరిధిలోని చిన్నా, పెద్ద అన్ని మండలాలను పరిగణలోకి తీసుకుంటే సుమారు రూ.5కోట్ల మేర ఇండెంట్లు వచ్చే అవకాశమున్నట్లు అంచనా.

దసరాకు వెలుగులు వచ్చేనా?

గతంలో గ్రామపంచాయతీలు స్థానిక వ్యాపారుల వద్ద తమకు అవసరమైన వాట్స్‌ల బల్బులను కొనుగోలు చేసుకుని వీధిలైట్లకు అమర్చేవి. వీటికిగాను పంచాయతీ కార్యదర్శులు మండల పంచాయతీరాజ్ ఇంజనీర్‌తో ఎంబీ రికార్డు చేయించి బిల్లు పెట్టుకునేవారు. ప్రస్తుతం జీపీల్లో నెలకొన్న నిస్సహాయస్థితిని గమనించి జిల్లా అధికారులు డీపీసీని ఏర్పాటుచేశారు. డీపీసీ నిర్ణయించిన రేటు మేరకే వేలం ద్వారా కాంట్రాక్ట్ పొందిన కాంట్రాక్టర్ వీధిలైట్లను సరఫరా చేయాల్సి ఉంది. కాంట్రాక్ట్ పొందిన టెండర్‌దార్లు అన్ని గ్రామ పంచాయతీలకు ఒకే సమయంలో వీధిలైట్లు సరఫరా చేయగలుగుతారా? దసరా రెండు మూడు రోజుల్లో ఉండగా సరఫరా చేస్తే వాటన్నింటినీ పండుగ లోపు బిగించడం సాధ్యమేనా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ నెల 25 లోపు వీధిలైట్లను అందజేస్తేనే తాము పండగ నాటికి బిగించడం సాధ్యమవుతుందని ఓ పంచాయతీ కార్యదర్శి అభిప్రాయం వ్యక్తంచేశారు.

అరువుపై స్ట్రీట్‌లైట్లు ఇవ్వడం లేదు

గతంలో దసరా పండుగ సమయంలోనే కాకుండా ఇతర సాధారణ రోజుల్లో కూడా అవసరమైనపుడు స్ట్రీట్‌లైట్లను అరువు పెట్టి తెచ్చాం. కానీ రెండేళ్ల బిల్లులు మంజూరు కాకపోవడంతో ఎలక్ట్రికల్ సామగ్రిని ఇచ్చేందుకు వ్యాపారులు నిరాకరిస్తున్నారు. డీఎల్‌పీసీ నిర్ణయించిన రేట్లకే లెడ్ బల్బులను సరఫరా చేస్తున్న అక్షయ ట్రేడర్స్‌కు మాకు కావల్సిన ఇండెంట్ పెట్టాం.

సుభాన్, పంచాయతీ కార్యదర్శి, నార్కట్‌పల్లి

గ్రామసభ ఆమోదం పొందాలి

స్ట్రీట్‌లైట్లకు తప్పనిసరిగా గ్రామసభ ఆమోదం ఉండాలి. ఇండెంట్ ప్రకారం కొనుగోలు చేసిన బిల్లులను సంబంధిత పీఆర్ ఏఈ ద్వారా ఎంబీ రికార్డు చేయించి వాటి ఖర్చుకు కూడా గ్రామసభ ఆమోదం పొంది తీర్మానం కాపీని జతచేయాల్సి ఉంది. ఆయా వాట్స్‌ల వారీగా డీఎల్‌పీసీ నిర్ణయించిన ధరకంటే తక్కువ రేట్లకే ఎల్ఈడీ స్ట్రీట్‌లైట్లు ఎవరైనా జీఎస్టీ చెల్లింపుదారైన ఎలక్ట్రికల్ వ్యాపారి విక్రయిస్తే వారి వద్ద నుంచి కొనుగోలు చేసే అవకాశం కూడా గ్రామ పంచాయతీలకు ఇచ్చాం. **వెంకయ్య, డీపీవో, నల్లగొండ జిల్లా.**

బాలా త్రిపురసుందరీదేవిగా..



కొండమల్లేపల్లిలో...



మిర్యాలగూడలోని ముత్తిరెడ్డికుంటలో..



అంగడిపేటలోని ఆంజనేయస్వామి దేవాలయం వద్ద పూజల్లో పాల్గొన్న భక్తులు



కొండమల్లేపల్లిలో పూజల్లో పాల్గొన్న మహిళలు



హాలియాలో...



చింతపల్లిలోని వీటీనగర్‌లో గాయిత్రీ పీఠంలో పూజలు చేస్తున్న భక్తులు

సినిమా గైడ్: మిర్యాలగూడ: శ్రీనివాస : కిష్కింధపురి, వెంకటేశ్వర: మిరాయ్, రాఘవ: భద్రకాళి, విట్రోస్: కిష్కింధపురి, లిటిల్ హార్ట్స్, మిరాయ్, దక్ష, భద్రకాళి, దేవరకొండ : మనోజ్ : లిటిల్ హార్ట్స్, మైత్రి వెంకటేశ్వర : మిరాయ్